ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:87 | ఎడిటర్:మేనం శ్యామ్ | శనివారం 17-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

బొద్దింకల నిరసన
బొత్తిగ అర్థం కాలేదు !
నిరాహారంతో నిరసనా !
వీరు మహాత్ముల సరసనా ?
నిరసనంటే విందులా
తాగివేసే చిందులా !
అర్ధరాత్రి ఆటలు
ఎటు దారి తీయు బాటలు !
నిరసనలో దేశంపై
నిలువెల్లా ద్వేశమా !
సామాజిక మాధ్యమాలు
చూపెడుతున్నది మోసమా ?
రాజకీయ పక్షాలు
ఆడుతున్న నాటకమా !
విధ్యార్థుల ముసుగులో
విద్రోహులు భూటకమా ?
ఎనుక ఏ "శక్తి" లేక విధ్యార్థుల చేతికి
"విత్తు"లెలా వస్తున్నవి?
ఏ "ఎత్తు" లేక దేశంలో
ఈ "గమ్మత్తు"లెలా జరుగుచున్నవి !
నిరసన తెలిపే ! రాజకీయ గ(ద)ళాలు
నిర్వీర్యం ఐనవా !
వీ(ధి)రి నాటకాలు జనాలు నమ్మరని
విధ్యార్థుల ఎగదోసినవా ?
ఎల్లలు దాటిన చొరబాటు దారులు
దేశంలో కోకొల్లలు.
దేశంలో వారి పీడ విరగడకే,
"సర్" రక్షా బందనం అలలు
వీరి ఏరివేతకే ఇన్ని వలలు.
విదేశీయులకు ఓటొద్దనే వివిద బందనాలు
రాజకీయ రాక్షసులకివి
ముందరి కాళ్ళ బందాలు
ఒక వర్గం ఓట్ల కోసమే
వీరు పడుతున్నరు పాట్లు.
పదవుల పాకులాట కోసమే
దేశానికి పెడుతున్నరు తూట్లు.
బెరికి గింజలేరుతుంటె
అసలు గింజలకెందుకు అలక !
విదేశీయుల చేతిలో ఉండాలా మన పిలక !

మీ .... రాజి రెడ్డి శీలం, ఇనుగుర్తి.

యాసంగిలో వరి వద్దు..
ఎల్‌నినోపై సీఎం రేవంత్ హెచ్చరిక

- నీటి నిల్వలు తగ్గుతున్నాయి.. తాగునీటికి ప్రాధాన్యమివ్వాలి
- యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయండి
- అదనంగా 5 వేల మెగావాట్లకు పెరిగిన విద్యుత్ డిమాండ్
- అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేస్తాం
- ఎల్‌నినోపై కేబినెట్ ఉపసంఘం.. నోడల్ అధికారిగా రామకృష్ణారావు

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రైతులు యాసంగి సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విద్యుత్ వినియోగం అధికం కావడం ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటి నిల్వలు తగ్గుతున్నాయి

ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్షించిన అనంతరం సచివాలయంలో సీఎం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో 400 టీఎం

సీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం నిల్వలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. తిరిగి వర్షాలు కురిసే వరకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.హైదరాబాద్‌కు తాగునీరు అందించే జలాశయాల్లోనూ నీటి మట్టాలు తగ్గుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ నీటిని వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

వరి సాగుకు విరామం ఇవ్వండి

నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు యాసంగిలో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని రేవంత్‌రెడ్డి కోరారు. సాగునీటి అవసరాలను తగ్గించకపోతే తాగునీటి సరఫరాపైనా ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని వివరించారు.వ్యవసాయ పనులు తగ్గడం వల్ల ఉపాధి కోల్పోయే రైతు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలానికి చెరువులు, కుంటలను సిద్ధం చేసే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని

మిగతా 2లో

దసరా నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు

- ఈ నెల 20న పరిమిత సేవల ప్రారంభానికి ఏర్పాట్లు
- తొలిదశలో రెండు అంతస్తుల్లో 22 విభాగాల ఓపీ సేవలు
- నవంబర్, డిసెంబర్‌లో దశలవారీగా మరిన్ని సేవలు
- రూ.1,150 కోట్లతో 2,208 పడకల సామర్థ్యంతో నిర్మాణం
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం

వరంగల్, ప్రజా వాయిస్: ఉమ్మడి వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మించిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈ నెల 20న దసరా సందర్భంగా పరిమిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కతో పాటు ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్

మిగతా 2లో

విమాన టికెట్ ధరలకు కళ్లెం

- రెండు వారాల్లో కొత్త నిబంధనలు
- సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- ధరల నియంత్రణ నిబంధనలకు పరిపాలనాపరమైన అనుమతులు
- వచ్చే రెండు వారాల్లో అధికారిక ప్రకటనకు సిద్ధం
- వచ్చే నెల 16న మరోసారి విచారణ
- అప్పటిలోగా కొత్త నిబంధనలు సమర్పించాలని కేంద్రానికి ఆదేశం

2లో



బార్ల లైసెన్సులకు భారీ పోటీ..
41 బార్లకు 8,770 దరఖాస్తులు

- దరఖాస్తు రుసుముల ద్వారానే ప్రభుత్వానికి రూ.87.71 కోట్ల ఆదాయం
- హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో లైసెన్సుల కోసం తీవ్ర పోటీ
- నగరంలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు
- మొయినాబాద్‌లో రెండు బార్లకు 664 మంది పోటీ
- బోధన్‌లో ఒక బార్‌కు అత్యల్పంగా 19 దరఖాస్తులు
- హైదరాబాద్‌లో హోరాహోరీ పోటీ

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణలో కొత్త బార్ లైసెన్సుల కోసం మద్యం వ్యాపారులు భారీగా పోటీ పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కేటాయించనున్న 41 బార్లకు ఏకంగా 8,770 దరఖాస్తులు రావడం గమనార్హం. దరఖాస్తు రుసుముల రూపంలోనే ప్రభుత్వ ఖజానాకు రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించి లైసెన్సుల కోసం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ముఖ్యంగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో బార్ల వ్యాపారంపై ఆసక్తి అధికంగా కనిపించింది.

మిగతా 2లో

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం.. రూ.37.40 లక్షలు స్వాహా

- నలుగురు నిందితుల అరెస్ట్
- అధిక లాభాల ఆశ చూపించి మహిళకు టోకరా
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో ముఠా గుట్టురట్టు
- మ్యూల్ ఖాతాలు, తొమ్మిది ఫోన్లు స్వాధీనం
- ఖాతాలిచ్చిన వారికి ఒక్కో ఖాతాపై రూ.10 వేల కమీషన్
- దేశవ్యాప్తంగా 54 కేసుల్లో రూ.10 కోట్ల మోసపూరిత లావాదేవీలు

2లో

డిండి ప్రాజెక్టును ఆపితేనే.. పులిబిడ్డ..

- సీఎం రేవంత్‌రెడ్డికి డీకే అరుణ సవాల్
- డిండి ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్
- పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడాలని హితవు
- గతంలో కేసీఆర్ నిలిపివేసిన ప్రాజెక్టును మళ్లీ ఎందుకు చేపడుతున్నారని ప్రశ్న
- పాలమూరును ఎండబెట్టే ప్రయత్నమా అంటూ విమర్శలు
- జడ్చర్లలో బీజేవైఎం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో వ్యాఖ్యలు

మహబూబ్‌నగర్, ప్రజా వాయిస్: డిండి ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ నేత డీకే అరుణ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ''నీవు నిజమైన పాలమూరు బిడ్డవే అయితే డిండి ప్రాజెక్టును ఆపాలి. అప్పుడే నిన్ను కొండారెడ్డి పులిబిడ్డ అంటారు'' అంటూ సవాల్ విసిరారు. శుక్రవారం జడ్చర్లలో నిర్వహించిన భారతీయ జనతా యువమోర్చా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

పాలమూరు రైతుల ప్రయోజనాలేవీ?

గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పక్కన పెట్టిన డిండి ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఎందుకు చేపడుతోందని డీకే అరుణ ప్రశ్నించారు. పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్‌రెడ్డి.. అదే ప్రాంత రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తారా అంటూ విమర్శించారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కంటే పాలమూరు ప్రాంత కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

పాలమూరును ఎండబెట్టే ప్రయత్నమా?

డిండి ప్రాజెక్టు నిర్మాణంతో పాలమూరు జిల్లా ప్రజల్లో ఆందోళన నెలకొందని అరుణ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తమ ప్రాంతానికి నీటి ప్రయోజనాలు తగ్గిపోతాయనే భయాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. పాలమూరు వలసలు కొనసాగాలన్నదే మీ ఉద్దేశమా అంటూ ప్రశ్నించారు. నల్గొండ ప్రాంత ప్రజలు బాగుండటంతో పాటు పాలమూరు ప్రజల ప్రయోజనాలనూ కాపాడాలని హితవు పలికారు.

గతంలో నిలిపివేశామని వ్యాఖ్య

గత ప్రభుత్వ హయాంలో తమ ఒత్తిడి కారణంగానే డిండి ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోయిందని డీకే అరుణ గుర్తుచేశారు. పాలమూరు నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్ ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని తాము ప్రశ్నించడంతో ప్రాజెక్టును నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మళ్లీ ముందుకు తీసుకురావడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

విద్యార్థుల హక్కులే లక్ష్యంగా రోహిత్ వేముల బిల్లు

- మూడు నెలల్లో సమగ్ర ముసాయిదా రూపకల్పన
- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు
- ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్షకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం
- సామాజిక బహిష్కరణను నిరోధించేలా నిబంధనలు
- ఎస్సీ అభివృద్ధి శాఖ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ
- న్యాయ, విద్య, హోంశాఖలకు కమిటీలో భాగస్వామ్యం

2లో

యాసంగిలో వరి వద్దు..
ఎల్‌నినోపై సీఎం రేవంత్ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

భరోసా ఇచ్చారు.

విద్యుత్ డిమాండ్ పెరుగుదల

రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. సాధారణ స్థాయితో పోలిస్తే సుమారు 5 వేల మెగావాట్ల మేర అదనపు డిమాండ్ పెరిగినట్లు వెల్లడించారు. అక్టోబర్‌లోనే వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవడం అసాధారణమని పేర్కొన్నారు.రైతులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అవసరమైన విద్యుత్‌ను మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అదనపు విద్యుత్ కేటాయింపులు చేయాలని, రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. విద్యుత్ సబ్సిడీలతో పాటు కేంద్ర, రాష్ట్ర సంయుక్త పథకాల్లో కేంద్ర నిధుల వాటాను పెంచాలని కూడా విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు.

ఎల్‌నినోపై ప్రత్యేక నిఘా

ఎల్‌నినో పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహించేందుకు కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన అదనపు నిధులు, విద్యుత్ సహాయం కోసం కేంద్రానికి నివేదికలు సమర్పిస్తామని చెప్పారు.మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. ఆయన ద్వారా అందించే సమాచారాన్ని అధికారిక వివరాలుగా పరిగణించాలని ప్రజలకు సూచించారు. ప్రకృతి పరిస్థితులను ఎదుర్కోవడంలో రాజకీయాలకు తావివ్వకుండా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

సూపర్ ఎల్‌నినోపై సర్కారు అప్రమత్తం

- పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్ అధికారులు
- తాగునీరు, సాగునీటి పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
- వర్షపాతం, విద్యుత్ సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్ష
- క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదికలు
- పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

హైదరాబాద్, ప్రజా వాయిస్: సూపర్ ఎల్‌నినో ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. వాతావరణ పరిస్థితుల్లో సంభవించే మార్పులు, వర్షపాతం లోటు, తాగునీరు–సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల పరిస్థితులను సమీక్షించేందుకు ప్రత్యేక అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమించింది.

నిరంతర పర్యవేక్షణ

నియమిత అధికారులు తమ పరిధిలోని జిల్లాల్లో తాగునీటి లభ్యత, సాగునీటి అవసరాలు, వర్షపాతం, విద్యుత్ సరఫరా, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించి, అవసరమైన చర్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ప్రత్యేక అధికారుల నియామకాలు

ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, వారి పరిధిలోని ఉమ్మడి జిల్లాల వివరాలు ఇలా ఉన్నాయి.

- ఉమ్మడి హైదరాబాద్: జయేష్ రంజన్
- ఉమ్మడి రంగారెడ్డి: వికాస్ రాజ్
- ఉమ్మడి కరీంనగర్: బెనహర్ మహేష్ దత్తా ఎక్కా
- ఉమ్మడి మెదక్: ఎ. వాణి ప్రసాద్
- ఉమ్మడి నిజామాబాద్: యోగితా రాణా
- ఉమ్మడి నల్గొండ: హరిచందన దాసరి
- ఉమ్మడి ఆదిలాబాద్: కె. ఇలాంబర్తి
- ఉమ్మడి వరంగల్:★ ఎ. శ్రీదేవిసేన
- ఉమ్మడి మహబూబ్‌నగర్: వి.పి. గౌతమ్
- ఉమ్మడి ఖమ్మం: అనుదీప్ దురిశెట్టి

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణతో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సమన్వయంతో చర్యలు చేపట్టనుంది

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం.. రూ.37.40 లక్షలు స్వాహా

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయంటూ ఓ మహిళను నమ్మించి రూ.37.40 లక్షలు వసూలు చేసిన కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సైబర్ మోసాలకు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాల వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చారు.

మ్యూల్ ఖాతాలతో మోసాలు

పోలీసుల కథనం ప్రకారం.. అధిక లాభాల ఆశ చూపించిన నిందితులు మహిళ నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. ఈ మోసంలో ఉపయోగించిన మ్యూల్ బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు, తొమ్మిది మొబైల్ ఫోన్లు, పది డెబిట్, క్రెడిట్ కార్డులు, ఎనిమిది చెక్‌బుక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఒక్కో ఖాతాకు రూ.10 వేల కమీషన్

బ్యాంకు ఖాతాలను సమకూర్చిన వారికి ఒక్కో మ్యూల్ ఖాతాపై రూ.10 వేల కమీషన్ ఇస్తామని ఆశ చూపించి, ఆ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా మోసపూరితంగా వచ్చిన డబ్బును బదిలీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు.

దేశవ్యాప్తంగా 54 కేసులు

ఈ ముఠాకు సంబంధించి దేశవ్యాప్తంగా 54 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఆయా కేసుల్లో సుమారు రూ.10 కోట్ల మేర మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో వచ్చే అధిక లాభాల హామీలను నమ్మే ముందు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

దసరా నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు

మొదటి పేజీ తరువాయి

ఆస్పత్రిని పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

తొలుత 22 విభాగాల్లో ఓపీ సేవలు

ప్రారంభ దశలో రెండు అంతస్తుల్లో 22 వైద్య విభాగాలకు సంబంధించిన ఔట్ పేషెంట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్‌లో మరిన్ని విభాగాలను ప్రారంభించి, డిసెంబర్ చివరి నాటికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే సేవల ప్రారంభం, విస్తరణకు సంబంధించిన తుది షెడ్యూల్ అధికారిక ప్రకటనతో స్పష్టమవుతుంది.

రూ.1,150 కోట్లతో భారీ ఆస్పత్రి

వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో సుమారు 56 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,150 కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. మొత్తం 2,208 పడకల సామర్థ్యంతో, 24 అంతస్తులతో నిర్మించిన ఈ భవనంలో వైద్య సేవలతో పాటు వైద్య విద్య, వైద్యుల విభాగాలకు కూడా స్థలం కేటాయించారు. అన్ని విభాగాలు అందుబాటులోకి వస్తే మొత్తం 37 వైద్య విభాగాల ద్వారా సేవలు అందించే అవకాశం ఉంది.

ఎంజీఎం నుంచి విభాగాల తరలింపు

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో అక్కడి వైద్య విభాగాలను కొత్త సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి దశలవారీగా తరలించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. కొత్త భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు.. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలకూ ప్రయోజనం

ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే రోగులకు కూడా ఈ ఆస్పత్రి ఉపయోగపడే అవకాశం ఉంది. భవిష్యత్తులో అవయవ దానం, అవయవ మార్పిడి, సంతానలేమి చికిత్సలకు సంబంధించిన ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడినా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆయన విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాన్ని పూర్తి చేసిందని తెలిపారు.

విద్యార్థుల హక్కులే లక్ష్యంగా రోహిత్ వేముల బిల్లు

హైదరాబాద్, ప్రజా వాయిస్:విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ★'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు–2026'★ను సమగ్రంగా రూపొందించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్ష, సామాజిక బహిష్కరణను నిరోధించేలా ఈ బిల్లును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మూడు నెలల్లో ముసాయిదా

బిల్లుకు సంబంధించిన సమగ్ర ముసాయిదాను మూడు నెలల్లో సిద్ధం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కమిటీకి ఎస్సీ అభివృద్ధి శాఖ నేతృత్వం వహిస్తుందని పేర్కొన్నారు. న్యాయ, విద్య, హోంశాఖలకు కూడా కమిటీలో భాగస్వామ్యం కల్పించనున్నట్లు వివరించారు.

నిపుణుల అభిప్రాయాల సేకరణ

బిల్లు రూపకల్పనలో న్యాయపరమైన అంశాలపై నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోనున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని ముసాయిదాలో పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు.ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షకు గురికాకుండా రక్షణ కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం వంటి అంశాలకు బిల్లులో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

విమాన టికెట్ ధరలకు కళ్లెం

న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: విమాన టికెట్ ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురానుంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో విమానయాన సంస్థలు టికెట్ ధరలను భారీగా పెంచుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్యకు సిద్ధమైంది. కొత్త నిబంధనలకు పరిపాలనాపరమైన అనుమతులు లభించాయని, మరో రెండు వారాల్లో వాటిని అధికారికంగా ప్రకటిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది.

వచ్చే నెల 16న తదుపరి విచారణ

విమాన టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కొత్త నిబంధనల రూపకల్పన పూర్తయిందని కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు వచ్చే నెల 16న తదుపరి విచారణ నిర్వహించనున్నట్లు పేర్కొంది. అప్పటిలోగా కొత్త నిబంధనలను తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశించింది.

భారీగా పెరుగుతున్న టికెట్ ధరలు

పండుగలు, సెలవులు, ఇతర రద్దీ సమయాల్లో విమాన టికెట్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానయాన సంస్థలు ఇష్టానుసారంగా ధరలు పెంచడం వల్ల సామాన్యులకు విమాన ప్రయాణం భారంగా మారుతోందని పిటిషనర్ వాదించారు. టికెట్ ధరల నిర్ణయంపై మరింత పర్యవేక్షణ ఉండాలని, ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త చట్టం కింద నిబంధనలు

భారతీయ వాయుయాన అధినియం–2024 కింద కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను రూపొందించినట్లు సమాచారం. ఈ అంశంపై గత విచారణల్లోనూ సుప్రీంకోర్టు విమానయాన సంస్థల ధరల విధానంపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే కొత్త నిబంధనల్లో ధరల పెరుగుదలపై ఎలాంటి పరిమితులు విధించనున్నారు, వాటిని ఎలా అమలు చేయనున్నారు అనే వివరాలు అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత స్పష్టమవుతాయి.

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై వరుస ప్రమాదం

- ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న ఆరు కార్లు
- పిల్లర్ నంబర్ 131 సమీపంలో ఘటన
- అదుపుతప్పి డివైడర్, విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- వెనుకే వచ్చిన మరో ఐదు కార్లు వరుసగా ఢీ
- ధ్వంసమైన ఆరు వాహనాలు
- ప్రయాణికులంతా సురక్షితం
- క్రేన్లతో కార్ల తొలగింపు.. ట్రాఫిక్ పునరుద్ధరణ

హైదరాబాద్, ప్రజా వాయిస్:హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై వరుసగా ఆరు కార్లు ఢీకొన్న ఘటన కలకలం రేపింది. పిల్లర్ నంబర్ 131 సమీపంలో ఆరంఘర్ వైపు వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వెనుకే వస్తున్న మరో ఐదు కార్లు ఒకదానికొకటి వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరు కార్లు దెబ్బతిన్నప్పటికీ, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా బయటపడినట్లు సమాచారం.

అదుపుతప్పిన కారు.. వరుసగా ఢీకొన్న వాహనాలు

ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న ఓ కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ కారు ఆకస్మికంగా ఆగిపోవడంతో వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో ఐదు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో వాహనాలు దెబ్బతినగా, ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది.

ట్రాఫిక్‌కు అంతరాయం

ఒకేసారి ఆరు కార్లు ప్రమాదానికి గురికావడంతో ఎక్స్‌ప్రెస్‌వేపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ల సహాయంతో దెబ్బతిన్న కార్లను రహదారి నుంచి తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రమాదానికి కారణాలపై ఆరా

అతి వేగమే ప్రమాదానికి కారణమా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. వాహనదారులు ఎక్స్‌ప్రెస్‌వేపై వేగ నియంత్రణ పాటించాలని, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం ఉంచాలని అధికారులు సూచిస్తున్నారు.

లైసెన్స్ తుపాకీతో కాల్చుకున్న వ్యక్తి

- హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం
- మృతుడు మహమ్మద్ అలీమ్ ఉద్దీన్ (50)
- కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు
- గతంలోనూ ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కుటుంబ సభ్యుల వెల్లడి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలోని హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహమ్మద్ అలీమ్ ఉద్దీన్ (50) తన వద్ద ఉన్న లైసెన్స్ తుపాకీతో కాల్చుకుని మృతి చెందారు. ఆటో గ్యారేజీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో మానసిక కుంగుబాటు

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అలీమ్ ఉద్దీన్ గత కొన్ని నెలలుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా ఆయన మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.ఘటన జరిగిన రోజు సాయంత్రం కుమారులతో కలిసి తన తండ్రి సమాధి వద్దకు వెళ్లిన అలీమ్ ఉద్దీన్.. తాను చనిపోతే తండ్రి సమాధి పక్కనే ఖననం చేయాలని వారితో చెప్పినట్లు సమాచారం. అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన కొద్దిసేపటికే పార్కింగ్ గదిలోకి ఒంటరిగా వెళ్లి తుపాకీతో కాల్చుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసుల దర్యాప్తు

సమాచారం అందుకున్న హుస్సేనీ ఆలం పోలీసులు క్లూస్ బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. రక్త నమూనాలతో పాటు ఆయన ఉపయోగించిన తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఘటనకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, దర్యాప్తు పూర్తయ్యాకే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

బార్ల లైసెన్సులకు భారీ పోటీ.. 41 బార్లకు 8,770 దరఖాస్తులు

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు అందాయి. మిగిలిన ప్రాంతాల్లోని 27 బార్లకు మరో 4,519 దరఖాస్తులు వచ్చాయి. నగర శివార్లలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్న ప్రాంతాల్లో లైసెన్సుల కోసం పోటీ ఎక్కువగా కనిపించింది.నార్సింగిలోని ది అడ్రస్ కన్వెన్షన్ హాల్‌లో ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ పర్యవేక్షణలో హైదరాబాద్ పరిధి బార్లకు డ్రా నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లక్కీ డ్రా చేపట్టారు.

మొయినాబాద్‌లో భారీ డిమాండ్

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మొయినాబాద్ ప్రత్యేకంగా నిలిచింది. అక్కడి రెండు బార్లకు ఏకంగా 664 దరఖాస్తులు వచ్చాయి. చేవెళ్లలోని ఒక బార్‌కు 279 దరఖాస్తులు అందాయి. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పరిధిలోని అలియాబాద్‌లో ఒక బార్‌కు 201 దరఖాస్తులు వచ్చాయి.యెల్లంపేట్‌లోని రెండు బార్లకు 225, మూడు చింతలపల్లిలోని రెండు బార్లకు 112 దరఖాస్తులు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రెండు బార్లకు 287 దరఖాస్తులు రాగా, గడ్డపోతారంలో 112, కోహిర్‌లో 127 దరఖాస్తులు అందాయి.

జిల్లాల్లోనూ భారీ స్పందన

ఇతర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ బార్ లైసెన్సుల కోసం గట్టి పోటీ నెలకొంది. ములుగులోని బార్‌కు 376 దరఖాస్తులు, అశ్వారావుపేటలో 357, స్టేషన్ ఘన్‌పూర్‌లో 349, కేసముద్రంలో 331, కల్లూరులో 325 దరఖాస్తులు వచ్చాయి.ఇక నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బార్‌కు కేవలం 19 దరఖాస్తులే అందాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లోని బార్‌కు 27 దరఖాస్తులు రాగా, పరిగిలో 36, మక్తల్‌లో 38 దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రాంతాన్ని బట్టి దరఖాస్తుల సంఖ్యలో గణనీయమైన వ్యత్యాసం కనిపించింది.

రుసుములతో ఖజానాకు భారీ ఆదాయం

41 బార్లకు వచ్చిన 8,770 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. లైసెన్సుల కోసం చెల్లించిన దరఖాస్తు రుసుములు తిరిగి చెల్లించనివి కావడంతో, లక్కీ డ్రాలో లైసెన్స్ దక్కని వారికి కూడా ఆ మొత్తం తిరిగి అందదు.లక్కీ డ్రా ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ తెలిపారు. ఎంపికైన దరఖాస్తుదారులకు నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ పూర్తి చేసి లైసెన్సులు కేటాయించనున్నారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో రాష్ట్రంలో బార్ వ్యాపారంపై ఉన్న ఆసక్తి మరోసారి చర్చనీయాంశమైంది.

శంకుస్థాపన చేసి రెండు నెలలైనా ప్రారంభం కాని చిన్న ఉమ్మెంత్యాల పనులు

- కొందుర్గ్ రోడ్డు పరిస్థితి రాత్రి వేళ్ళలో మరి ప్రమాదకరంగా రోడ్ పరిస్థితి
- బారీ గుంతలతో తరచు ప్రమాదాలు
- కొత్తవారు వస్తె అంతే సంగతి

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)రంగారెడ్డి జిలా కొందుర్గ్ మండమలోని చిన్న ఉమ్మెత్యాల రోడ్ పరిస్థితి చాలా దారుణంగా తయారైంది,ఈ మార్గములో కొత్త. ప్రయాణికులు ప్రయాణం చేస్తే అంతే సంగతి జరుగుతుంది , కొందుర్గ్ నుండి చిన్న ఉమ్మెంత్యాల వయా షాబాద్ మార్గములో ప్రయాణం చాలా సులువు తక్కువ సమయంలో ఇటు షాద్ నగర్ అటు చేవెళ్ల వెళ్ళటానికి అనువుగా ఉంటుంది,ఈ మార్గములో తరచూ రాత్రి ప్రమాదాలు జరుగుతూ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు, గడచిన వారం రోజుల క్రితం,నర్సింలు అనే ప్రయాణికుడు సుల్తానా పూర్ గ్రామం పరిగి మండలం వ్యక్తి ఈ మార్గములో ప్రయాణం చేస్తూ గుంతల మయం రోడ్ గుర్తుఎరుగక ప్రమాదంజరిగి తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డాడాడు,ఈ రోడ్ ను స్థానిక ఎమ్మెల్యే గడచిన రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసిన నేటికి కూడా రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం కాక పోవటం చాలా శోచనీయం,ఈ మార్గములో అత్యవసర వైద్య.సేవలైన ప్రసూతి సేవలు వృద్ధులు వికలాంగుకు విద్యార్థులు ప్రయాణం చేయాలంటే ఎంతో ప్రయాస పడాల్సిన అవసరం ఏర్పడుతుంది,కావున సంబంధిన అధికార యంత్రాంగం వేగవంతమైన చర్యలు చేపట్టి చిన్న ఉమ్మెత్యాల రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

"అమ్మో.. స్కూల్‌కు వెళ్లాలంటే భయమేస్తోంది!"

- రోడ్డు పక్కనే సమాధులు.. భయాందోళనలో చిన్నారులు!
- స్మశానవాటికకు స్థలం లేక రహదారి పక్కనే మృతదేహాల ఖననం
- కుమ్మరిగూడెం గ్రామానికి ప్రత్యేకంగా స్మశానవాటిక ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్

ప్రజా వాయిస్, సంగారెడ్డి: స్మశానవాటికకు స్థలం లేక పోవడంతో గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పక్కనే మృతదేహాలను ఖననం చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలోని ఆందోల్ మున్సిపాలిటీ ఆరో వార్డు పరిధిలో ఉన్న కుమ్మరిగూడెం గ్రామంలో నెలకొన్న పరిస్థితి.గ్రామంలో స్మశానవాటికకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో ఎవరైనా మృతి చెందితే గ్రామ ప్రధాన రహదారి పక్కనే మృతదేహాలను పూడ్చిపెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తాజాగా శుక్రవారం ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో రహదారి పక్కనే ఖననం చేసేందుకు ప్రయత్నించగా, కొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇకపై రోడ్డు పక్కన మృతదేహాలను పూడ్చిపెట్టవద్దంటూ వాగ్వాదానికి దిగారు.

పిల్లల్లో భయం.. తల్లిదండ్రుల్లో ఆందోళన!

పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రహదారి పక్కన కనిపించే సమాధులను చూసి భయపడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని, కొందరు చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు.

మంత్రి, అధికారులూ స్పందించాలి!

కుమ్మరిగూడెం గ్రామానికి ప్రత్యేకంగా స్మశానవాటిక స్థలం కేటాయించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులతో పాటు సంబంధిత మంత్రిని కోరుతున్నారు. చిన్నారులు భయాందోళన లేకుండా పాఠశాలలకు వెళ్లేలా, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పండుగ రాకముందే ఆర్టీసీ స్పెషల్ బాదుడు!

- మంథని-కరీంనగర్ ప్రయాణంలో రూ.110 నుంచి రూ.150కి ఛార్జీ
- అదనపు వసూళ్లపై ప్రయాణికుల ఆవేదన

ప్రజా వాయిస్ మంథని పండుగలు ప్రారంభం కాకముందే ఆర్టీసీ బస్సుల్లో స్పెషల్ ఛార్జీల బాదుడు మొదలైందా? సాధారణ ఛార్జీలకు అదనంగా వసూలు చేస్తున్న మొత్తాలపై ప్రయాణికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పెద్ద బతుకమ్మ, దసరా పండుగలకు మరికొన్ని రోజుల సమయం ఉండగానే అదనపు ఛార్జీల వసూళ్లు ప్రారంభమయ్యాయంటూ పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంథని నుంచి కరీంనగర్‌కు సాధారణ ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీ రూ.110గా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ మార్గంలో ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులు ఒక్కొక్కరికి రూ.110 చొప్పున చెల్లించారు. అదే ఇద్దరు వ్యక్తులు సాయంత్రం మరో బస్సులో ప్రయాణించగా, ఒక్కొక్కరి వద్ద రూ.150 చొప్పున వసూలు చేశారని తెలిపారు. గంటల వ్యవధిలోనే ఒక్కో టికెట్‌పై రూ.40 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అదనపు ఛార్జీ ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించగా, పండుగ స్పెషల్ ఛార్జీ అని సమాధానం ఇచ్చినట్లు ప్రయాణికులు వెల్లడించారు. అయితే, ఈ అదనపు వసూళ్లు ఏ నిబంధనల ప్రకారం చేస్తున్నారో ఆర్టీసీ అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఏర్పడిన నష్టాలను స్పెషల్ ఛార్జీల రూపంలో ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక వివరణ రావాల్సి ఉంది. పండుగల సమయంలో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రజా రవాణాపై ఆధారపడతారు. అలాంటి సమయంలో అదనపు ఛార్జీల భారం ప్రయాణికులపై పడితే ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు. పండుగ ప్రత్యేక బస్సులకు అదనపు ఛార్జీలు వర్తించే నిబంధనలు ఏమిటి? మంథని–కరీంనగర్ మార్గంలో వసూలు చేసిన రూ.150 టికెట్ ఛార్జీకి అధికారిక ఆధారం ఏమిటి? అనే ప్రశ్నలకు ఆర్టీసీ అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంది. పండుగ వేళ ప్రయాణికులకు సౌకర్యం కల్పించాల్సిన ఆర్టీసీ.. అదనపు ఛార్జీల విషయంలోనూ పారదర్శకత పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బతుకమ్మ ఘాట్, స్మశానవాటిక నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తాం

- మున్సిపాలిటీ 16వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక కృషి
- ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ

ప్రజా వాయిస్ మహబూబాబాద్ పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని రాహుల్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకుమహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మురళి నాయక్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాం నాయక్ మాట్లాడుతూ..16 వార్డు అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. 16వ వార్డు పరిధిలోని మున్నేరు వాగు సమీపంలో బతుకమ్మ ఘాట్ లేకపోవడంతో బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు, ఆడపడుచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా స్మశానవాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్నేరు వాగు సమీపంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణంతో పాటు, స్మశానవాటిక ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే మురళి నాయక్‌ను కోరారు.వార్డులోని కొన్ని బజారులో సీసీ రోడ్డు సైడ్ డ్రైనేజి మిషన్ భగీరథ పైప్ లైన్ లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని వారి నిర్మాణానికి వార్డుకు నిధులు కేటాయించాలని కోరారు కౌన్సిలర్ విజ్ఞప్తిపై ఎమ్మెల్యే మురళి నాయక్ సానుకూలంగా స్పందిస్తూ, బతుకమ్మ ఘాట్, స్మశానవాటిక నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే సీసీ రోడ్డు సైడ్ డ్రైనేజి పైప్ లైన్ కు ప్రత్యేక చోరువా చూపుతామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాం నాయక్ మాట్లాడుతూ, 16వ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందుండి కృషి చేస్తున్నామని, వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే మురళి నాయక్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి, 16వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. వార్డు అభివృద్ధే ధ్యేయం.. ప్రజల సంక్షేమమే మా బాధ్యత!అని చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్.మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య.మున్సిపాలిటీ డి.ఇ ఉపేందర్.వార్డు కౌన్సిలర్ బానోత్ బాబు.బోల్లా రాజు. గాడిపల్లి చరణ్. అంబాల శివ. దిలీప్. నిమ్మల శ్రీనివాస్. ఎడ్ల రమేష్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు వెంకటి.ఎస్ కె ఘపూర్. బానోత్ సురేష్.సిపిఎం పార్టీ నాయకులు రావుల రాజు. చాగంటి భాగ్యమ్మ. పసలది మధు బానోత్ ప్రకాష్. బానోత్ సుమన్. పాటి సారయ్య.బడుగుల లక్ష్మయ్య. చిన్నల్లి స్వామి భావిరీముల్లా రవి. భూక్యా సుమన్. గుగులోతు శివ మద్దెల శ్రీ లక్ష్మి జనగాం శ్రీను. మండవ రాజు శ్రీను కాలనీ వాసులు తదితరులు పాల్గున్నారు.

తమ్మరబండపాలెంలో పోలీసుల కార్డన్ సెర్చ

- 53 వాహనాల తనిఖీ.. పత్రాలు లేనివి సీజ్

ప్రజా వాయిస్,అనంతగిరి:సూర్యాపేట జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మరబండపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున కోదాడ సబ్‌డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ డి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సుమారు 60 మంది పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో వాహనాలను తనిఖీ చేసి, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. మొత్తం 53 ద్విచక్ర వాహనాలు, ఆటోలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు అనంతగిరి ఎస్‌ఐ ఎం. ఏడుకొండలు పత్రికా ప్రకటనలో వెల్లడించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల నియంత్రణలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ షరీపుద్దీన్

- కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం!
- పోషకాహార లోపం ఉన్న పిల్లల గుర్తింపులో విశేష సేవలకు గుర్తింపు

ప్రజా వాయిస్ పెద్దశంకరంపేట:మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'పోషణ్ అభియాన్' కార్యక్రమంలో పెద్దశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ షరీపుద్దీన్ ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్నారు. మండల పరిధిలో తీవ్ర పోషకాహార లోపం (ఎస్‌ఏఎం), మితమైన పోషకాహార లోపం (ఎంఏఎం) ఉన్న పిల్లలను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితిని, పోషకాహార స్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గాను ఆయనను ఈ అవార్డు వరించింది.చిన్నారుల ఆరోగ్యం పట్ల ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ చేతుల మీదుగా డాక్టర్ షరీపుద్దీన్ అవార్డును స్వీకరించారు. ఒక ప్రభుత్వ వైద్యుడిగా నిరుపేదలకు, చిన్నారులకు ఆయన అందిస్తున్న సేవలకు జిల్లా స్థాయిలో ఈ గుర్తింపు లభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పురస్కారం ఆయన భవిష్యత్తులో ప్రజలకు మరింత అంకితభావంతో వైద్య సేవలు అందించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని పలువురు స్థానికులు, తోటి వైద్య సిబ్బంది అభిప్రాయపడుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చోక్ల తండాలో అక్రమ భూ రిజిస్ట్రేషన్

- ధరణి భూ బాగోతం
- న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు
- భూమిని ,అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, తమ బ్రతుకులు బజారున పడేస్తున్నారని కుటుంబం
- లబోదిబోమంటూ వినిపిస్తున్న దీనస్థితి.

ప్రజా వాయిస్ /యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చోక్ల తండాలో ధరణి భూ బాగోతం లో తమకు తెలవకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తమకు న్యాయం చేయాలని అధికారులకు మొర పెట్టుకుంటున్న సంఘటన....వివరాలల్లోనికి వెళితే ....తరతరాలుగా తాత ముత్తాతల నుంచి వ్యవసాయమే జీవనాధారంగా సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని భూక్య పాచ్య, భూక్య మహేందర్ లు మీడియా ముందు తమ గోడు వెల్లబోసుకున్నారు.సర్వే నెంబర్ 140 లో రెండున్నర ఎకరాల కు పైగా భూమిలో సేద్యం చేస్తూ పంటలు పండించుకుంటూ, జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల తమ గ్రామం బస్వా పురం (నృసింహ సాగర్) ప్రాజెక్టు ముంపుకు గురవుతున్నందున బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు వివరాల సేకరణలో తమ భూమి ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ కావడం పట్ల కుటుంబం గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న దుస్థితి వెలుగులోనికి వచ్చింది.ఏది ఏమైనా తమ గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని మీడియా ద్వారా అధికారులను ప్రాధేయ పడుతున్నారు .మరోవైపు అధికారులు రిజిస్ట్రేషన్ ఉన్నవారికి పరిహారం అందిస్తామని ప్రకటించడంతో దిక్కుతోచని పరిస్థితిలో కుటుంబం సభ్యులు ఆందో ళన వర్ణతీతం . అధికారులకు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న తన మొర ఆలకించడం లేదని ,ఈ క్రమంలో తమ కుటుంబం కూలి, నాలి చేసుకొని కడు పేదరికంలో పిల్లాపాపలతో దీన స్థితిలో జీవనం సాగిస్తున్నామని వచ్చే పరిహారం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అందించి నట్లయితే తమ బ్రతుకులు దుర్భరంగా మారుతాయి అని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

నిబద్ధతకు నివాళి.. కుటుంబానికి భరోసా

- శివశంకర్ మృతి పట్ల ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ సంతాపం
- అకాల మరణం చేవెళ్ల ప్రాంత ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటు
- కుటుంబానికి అండగా ఉంటామని మందకృష్ణ భరోసా

మొయినాబాద్(ప్రజావాయిస్) : ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో నిబద్ధతతో పనిచేసిన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ అకాల మరణం ఉద్యమానికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఇటీవల ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందిన శివశంకర్ మాదిగ కుటుంబాన్ని గురువారం శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామంలో ఆయన పరామర్శించారు.ఈ సందర్భంగా శివశంకర్ మాదిగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తల్లిదండ్రులు, భార్య, పిల్లలను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శివశంకర్ మాదిగ మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో శివశంకర్ మాదిగ చురుకుగా పాల్గొంటూ, సంస్థ బలోపేతానికి కృషి చేశారని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఉద్యమం పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన మరణం చేవెళ్ల ప్రాంత ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని అన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగాళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ, చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లేష్ మాదిగ, మొయినాబాద్ మండల అధ్యక్షుడు కుమార్ మాదిగ, షాబాద్ మండల అధ్యక్షుడు ముల్కి ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే దొంతి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు

..ప్రజా వాయిస్,చెన్నారావుపేట :చెన్నారవు పేట మండలం గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు.. ఈ రోజు పదహారు చింతల గ్రామం ఖాదర్ పేట గ్రామం జోజిపేట నారాయణ తండాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసిన సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనా కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని అన్నారు..అలాగే మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని వారు అన్నారు.. పదహారు చింతల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ సుమారు రూ.6.5 లక్షలు మంజూరు ఇచ్చి ప్రారంభించారు.ఖాదర్ పేట గ్రామం లో 10లక్షల విలువ గల మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.. గొల్ల పెల్లి గ్రామంలో బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు.. జోజిపేట నారాయణ తండాలో రూ. 15లక్షల సీసీ రోడ్లు మంజూరు చేసిప్రారంభించారు. రూ.6.5లక్షల వాటర్ ప్లాంట్ కి కేటాయించి ప్రారంభించారు.....ఈ కార్యక్రమంలో వీరి వెంట పీసీసీ సభ్యులు నియోజకవర్గ కన్వీనర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కౌన్సిలర్లు సొసైటీ చైర్మన్ లు మాజీ ఎంపీపీ మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు రాలు అధికారులు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రధాన కార్య దర్శులు ఆయా గ్రామాల సర్పంచ్లు ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు మార్కెట్ డైరెక్టర్లు సొసైటీ డైరెక్టర్లు ఆయా గ్రామాల ఉప సర్పంచులు వార్డు సభ్యులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

యాసంగిలో వరి సాగు చేయవద్దు!

- ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత
- తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలి
- రైతులకు ప్రత్యేక అధికారి దాసరి హరిచందన కీలక సూచన

ప్రజా వాయిస్ || నల్లగొండ..నల్లగొండ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే పరిస్థితులు ఉన్నందున యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎల్‌నినో ప్రత్యేక అధికారి దాసరి హరిచందన రైతులకు సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని స్పష్టం చేశారు.నీరందక ఎండుతున్న పంటలు.. రైతులకు నష్టాలు!శుక్రవారం కనగల్ మండలం శేరిలింగోటం గ్రామంలో నీటి కొరతతో ఎండిపోయిన వరి, పత్తి పొలాలను దాసరి హరిచందన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవ కపోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం ముందుగానే హెచ్చరించినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేపట్టారని ఆమె పేర్కొన్నారు. పంట చేతికొచ్చే సమయంలో భూగర్భ జలాలు అడుగంటడంతో వరితోపాటు పత్తి పంటలు కూడా ఎండిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వరి సాగుతో పెరగనున్న నీటి, విద్యుత్ వినియోగంఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయడం వల్ల భూగర్భ జలాల వినియోగం పెరగడమే కాకుండా విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుందని హరిచం దన వివరించారు. తీరా పంట చేతికిరాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.రైతులు ఇప్పటి పరిస్థితు లను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి లభ్యతను అంచనా వేసుకున్న తర్వాతే పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలకే ప్రాధాన్యం నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితుల్లో బోర్లు, బావుల కింద వరి సాగు చేయకుండా, తక్కువ నీరు అవసరమయ్యే స్వల్పకా లిక పంటలను ఎంచుకోవాలని ప్రత్యేక అధికారి సూచించారు.ప్ర స్తుతం పంటలు ఎండిపోవడం వల్ల ఎదురవుతున్న నష్టాలను స్వయంగా అనుభవించిన రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకోవాలని కోరారు. తద్వారా ఇతర రైతులు కూడా అప్రమత్తమై నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం విత్తనాలు, ఇతర అవసరమైన సహకారం అందిస్తుందని ఆమె వెల్లడించారు.క్షే త్రస్థాయిలో పరిశీలన.. అధికారుల భాగస్వామ్యంఈ పర్యటనలో నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్, జిల్లా వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, ఏవో బి. అమరేందర్ గౌడ్, శేరిలిం గోటం సర్పంచ్ పోషమల్ల సురేష్, ఏఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ కోత ఎత్తి వేయాలని రైతుల ధర్నా

- బిజెపి ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి
- ఎండుతున్న పంటలు.. కాలుతున్న మోటార్లు
- రైతులను కాపాడాలని కొయ్యల ఏమాజి డిమాండ్ .

ప్రజా వాయిస్ కన్నెపల్లి.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజక వర్గంలోని కన్నేపల్లి మండలములోఅప్రకటిత కరెంట్ కోత వల్ల రైతుల పంటలు ఎండుతున్నాయని, లో ఓల్టేజితో పంటలు ఎండుతున్నాయని బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. ఈ రోజు బిజెపి కన్నెపల్లి మండల అధ్యక్షులు ఆశన్న ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడించి ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కొయ్యల ఏమాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్రకటితంగా కరెంట్ కోత విధిస్తున్నదని, దీనివల్ల రైతుల పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ వల్ల రోజూ రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు కాలి పోతున్నాయని, దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు విద్యుత్ కోతలు లేవని రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామ స్థాయిలో పర్యటిస్తే రైతుల పంటలు ఎలా ఎండుతున్నాయో అర్థం అవుతుందని తెలిపారు. రైతులకు 12 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండుతున్న పంటలకు ఎకరానికి 25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కరెంట్ కోత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ రైతుల బాధలు పట్టక హైదరాబాద్ లో ఉండి ప్రజల్ని మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో బెల్లంపల్లి లో ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఇప్పుడు మోసం చేస్తున్నా రని అన్నారు. ఆయన్ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆశన్న, సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, బి సి మోర్చ జిల్లా ఉపా ధ్యక్షులు రామయ్య యాదవ్, గోవర్దన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్, బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షులు యుగంధర్, బిజెపి నాయకులు సురేష్, మల్లేష్, మహేందర్, డాగయా తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్లంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి
- వికారాబాద్ లో ఎంపీ మల్లు రవి మీడియా సమావేశం

ప్రజావాయిస్/వికారాబాద్:రానున్న రంగారెడ్డి–మహబూబ్‌నగర్–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.శుక్రవారం వికా రాబాద్ పట్టణంలోని సాకేత్ నగర్‌లో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో మల్లు రవి మీడియా సమావేశం నిర్వహించారు. పట్టభ ద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆయనను ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సామాన్య కార్యకర్తగా కింది స్థాయి నుంచి ఎదిగిన ఉత్సాహవంతుడైన యువ నాయకుడు సామా రామ్మోహన్ రెడ్డిని అభ్యర్థిగా నిలిపిందన్నారు.దేశంలో యువత మార్పును కోరుకుంటోందని, యువత ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోం దని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమవుతోందని, విద్యా వ్యవస్థలో కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై రాహుల్ గాంధీ చురుకుగా పోరాడుతు న్నారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రత్యేక ప్రణాళికతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందుకు సాగుతున్నామని మల్లు రవి వెల్లడించారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ మద్దతు సాధించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రి అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎన్. కిషన్ నాయక్, మాజీ జడ్పీటీసీ మహిపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు శ్రీనివాస్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, నాయకులు అనంత్ రెడ్డి, రామచంద్రరెడ్డి, నర్సింలు, బాదాం అశోక్, రాములు, రాఘవేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామచంద్రరెడ్డి, పురుషోత్తం రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పగటిపూటా వీధి దీపాల వెలుగులు

- విద్యుత్ వృథాపై అధికారుల నిర్లక్ష్యం!
- రామగుండం 60వ డివిజన్ లో పర్యవేక్షణ కరువు
- వనరుల పొదుపుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ప్రజా వాయిస్ గోదావరిఖని ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచిస్తుంటే.. మరోవైపు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 60వ డివిజన్‌లో వీధి దీపాలు పగటి వేళల్లోనూ వెలుగుతుండటంతో విద్యుత్ వినియోగంపై అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పర్యవేక్షణ లోపమే కారణమా?

వీధి దీపాలు అవసరమైన సమయాల్లోనే వెలిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే, పగటిపూట కూడా లైట్లు వెలుగుతుండటంతో విద్యుత్ వినియోగంపై పర్యవేక్షణ లోపించిందనే అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. సమయానికి స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్న లక్ష్యం క్షేత్రస్థాయిలోనూ అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు సూచిస్తున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ముఖ్యంగా సంబంధిత విభాగం సిబ్బంది ఈ సమస్యపై దృష్టి సారించి, వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించాలని కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశాన్ని పరిశీలించి, పగటిపూట వీధి దీపాలు వెలగడానికి గల కారణాలను గుర్తించి, విద్యుత్ వృథాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని 60వ డివిజన్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్తగూడమండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- విద్యుత్ కోతలనునివారించాలి
- రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల నష్టపరిహారంచెల్లించాలి
- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్

ప్రజా వాయిస్ కొత్త గూడ తహసిల్దార్, ఏఈ ల కు మెమోరాండం ఇవ్వడం జరిగింది సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలాన్ని కరువు మండలంగా ప్రక టించాలని, మరియు విద్యుత్ కోతలను నివారించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించి స్థానిక తహసిల్దార్ కి మరియు ఏ ఇ కార్యాలయంలో ఉన్న లైన్మెన్ కృష్ణయ్యకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బుర్కా బుచ్చి రాములు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో సూపర్ దూపర్ ఆల్ ని వో ప్రభావంతో సరైన వర్షాలు పడక రైతులు రైతు కూలీలు సామాన్య పేద మధ్య తరగతి ప్రజలు చివరమైన ఇబ్బందులు పడుతూ తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటూ సరైన దిగుబడి రాక అప్పుల ఊబిలోకి కోరుకో పోతున్న పరిస్థితి ఉంది కరువు సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున సాగు చేయని రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు చొప్పున నష్టపరిహారాన్ని అందించాలని అదే విధంగా కరెంటు కోతలను నివారించి నిరంతరాయంగా విద్యుత్ను సరఫరా చేయాలని ఎల్లార్ లోడ్ రిలీఫ్ పద్ధతిని ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ శ్రీశైలం, పుల్లన్న,జిట్టబోయిన రామచంద్రు, గోగ్గేల రాంబాబు,రాజమల్లు, దేవేందర్, నర్సక్క, టి ప్రభాకర్, నిర్మల, సోమయ్య, జంగ సదానందం, వెంకన్న, గుగ్గిళ్ళ వెంకన్న, వెంకటేశ్వర్లు రాంసింగ్, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం.. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

- రేషన్ సన్నబియ్యంతో వండిన భోజనం చేసిన ఎమ్మెల్యే.
- అమ్మవారికి రూ.20,116 కానుక అందజేసిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి
- హాజరైన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్ర శేఖర్ రెడ్డి.

ప్రజా వాయిస్, నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి గురువారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్దవూర మండలం రామన్నగూడెం తండాలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారుల కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం ఓ లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా అందిస్తున్న సన్నబియ్యంతో వండిన భోజనాన్ని ఆరగించారు.అనంతరం నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి రూ.20,116 కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమాల్లో లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ యువజన నాయకులు, మండల నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

- దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు
- ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు.

శాంతినగర్ దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మరోవైపు, మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న శ్రీ దుర్గామాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మన్విత ఫుడ్ కోర్ట్'లో మద్యం దందా!

- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న యజమాన్యం
- స్థానికుల తీవ్ర ఆగ్రహం
- అధికారుల మౌనమేమిటి..?

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి మండల కేంద్రంలో ని కాస వైన్స్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అనధికారిక సిట్టింగ్ రూమ్‌లు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు విద్యార్థులకు పెను శాపంగా మారుతున్నాయి. తాజాగా ముల్కనూర్ రోడ్డు కు వెలిసిన ఒక ఫుడ్ కోర్టు దందా ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. కాస వైన్స్ పక్కనే ఉన్న 'మన్విత ఫుడ్ కోర్ట్' పేరుతో నడుస్తున్న ఈ ప్రాంగణంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోయినా, దొడ్డిదారిన మందు సిట్టింగ్ రూమ్‌లుగా వాడుతున్నారు.

సిట్టింగ్ అడ్డాగా మార్పు

వైన్స్ నుంచి మద్యం తెచ్చుకుని ఇక్కడ కూర్చుని తాగుతుండటంతో, ఇది ఒక అనధికారిక బార్‌ను తలపిస్తోంది. పక్కనే వైన్స్ పర్మిట్ రూమ్ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సరిగ్గా ఇదే వైన్స్ పక్కనే మరో వైపు ఇప్పటికే అధికారిక పర్మిట్ రూమ్ అందుబాటులో ఉంది. అయినప్పటికీ, ఈ ఫుడ్ కోర్టును కూడా అదనపు సిట్టింగ్ అడ్డాగా మార్చడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.స్థానికులు, మహిళల తీవ్ర ఆందోళన వైన్స్ సిట్టింగ్ రూమ్‌ల వల్ల ఆ ప్రాంతంలో నిత్యం రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగుబోతుల హడావుడితో మహిళలు, చిన్నారులు ఆ మార్గంలో నైట్ టైమ్ నడవాలంటేనే భయపడిపోతున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఫుడ్ కోర్టు ముసుగులో జరుగుతున్న ఈ అసాంఘిక దందాపై ఇప్పటికే స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రశ్నార్థకంగా అధికారుల తీరు

నిబంధనలకు విరుద్ధంగా కళ్ల ముందే ఒక అనధికారిక పర్మిట్ రూమ్ నడుస్తున్నప్పటికీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్. మిగతా శాఖ అధికారులు తక్షణమే స్పందించి, మన్విత ఫుడ్ కోర్టుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీసీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే మంత్రి పొన్నం ప్రభాకర్

- నందిగామలో ఘనంగా గౌడ్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం
- పాల్గొన్న పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

పటాన్‌చెరు ప్రజావాయిస్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో బీసీల అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు శుక్రవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ్ హాస్టల్ భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంలో గౌడ్ హాస్టల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఇటువంటి వసతి గృహాలు దోహదపడతాయని తెలిపారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు వసతి పరంగా మరింత ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచ్లు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

లక్కీ డ్రాలో బార్ల దక్కింపు

- పరిగి బార్ కు సోమలింగం.. కొడంగల్ బార్ కు అనిల్ ఎంపిక

ప్రజావాయిస్/వికారాబాద్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా పరిగి, కొడంగల్ బార్లకు శుక్రవారం ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఈ డ్రాలో పరిగి బార్‌కు కే. సోమలింగం, కొడంగల్ బార్‌కు వర్కాల అనిల్ ఎంపికయ్యారు.కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన లక్కీ డ్రాను అదనపు కలెక్టర్ వెంకట చారి తీశారు. అనంతరం ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పొన్నం చొరవతో హైమాస్ట్ దీపాలకు రూ.56 లక్షలు

- భీమదేవరపల్లి మండలంలో 50 పనులకు కలెక్టర్ పరిపాలనా అనుమతులు

ప్రజా వాయిస్, భీమదేవరపల్లి: హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మరో ముందడుగు పడింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవతో భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.56 లక్షల నిధులు మంజూరయ్యాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) 2026–27 నిధుల కింద 50 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామాల్లో రాత్రివేళ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించడం, ప్రధాన కూడళ్లు, కాలనీలు, బస్టాండ్లు, ఆలయాల వద్ద వెలుగులు ఏర్పాటు చేసి భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహించనున్నారు.

పలు గ్రామాల్లో దీపాల ఏర్పాటు

భీమదేవరపల్లి మండలంలోని భీమదేవరపల్లి, బొల్లోనిపల్లి, చాంతయ్యపల్లి, ధర్మారం, ఎర్రబెల్లి, గాంధీనగర్, గట్లనర్సింగాపూర్, గొల్లపల్లి, కొప్పూర్, కొత్తకొండ, కొత్తపల్లి, మల్లారం, మాణిక్యాపూర్, ముల్కనూర్, ముస్తఫాపూర్, ముత్తారం, రాంనగర్, రంగయ్యపల్లి, రసూల్‌పల్లి, రత్నగిరి, వంగర, వీర్లగడ్డ తండా, విశ్వనాథ కాలనీ, సాయినగర్, వీరభద్ర నగర్ తదితర గ్రామాల్లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పనికి రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించారు.

ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలి

మంజూరైన పనులకు సంబంధిత శాఖ అధికారులు సాంకేతిక అనుమతులు పొంది, పరిపాలనా అనుమతులు జారీ చేసిన తేదీ నుంచి ఆరు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పనులను ప్రభుత్వ స్థలాల్లోనే చేపట్టాలని స్పష్టం చేశారు. పనులు ప్రారంభానికి ముందు, పనుల పురోగతిలో, పూర్తయిన అనంతరం జియో ట్యాగింగ్‌తో కూడిన ఛాయాచిత్రాలు, నాణ్యతా నియంత్రణ నివేదికలు సమర్పించిన తర్వాతే నిధులు విడుదల చేయనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు విస్తరించేందుకు నిధులు మంజూరు కావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ నినోను అందరం కలిసి ఎదుర్కొందాం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ పిలుపు
- వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కుల అందజేత
- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య, ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్ నినో ప్రకృతి విపత్తును అందరం కలిసి ఎదుర్కోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు.వికారాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల య ంలో శుక్రవారం 97 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. 58 మంది కళ్యాణ లక్ష్మి, 39 మంది షాదీ ముబారక్ లబ్ధిదారులకు మొత్తం రూ. 97 లక్షల 11 వేల 252 విలువైన చెక్కులను స్పీకర్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య అందించారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం 100 దేశాల్లో ఉందని, రైతులు ప్రభుత్వ సూచనలు పాటించాలని కోరారు. సాగు నీటిని పొదుపుగా వాడాలని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో వికారాబాద్ లోని శివసాగర్ చెరువును సుందరీకరిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు తీపి కబురు చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రంగరాజు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద మూడు రోజులుగా వేతనాల కోసం కార్మికుల ఆందోళన

- ఒక నెల వేతనం చెల్లించాలని డిమాండ్
- కమిషనర్ ను అడ్డుకున్న కార్మికులు.

ప్రజా వాయిస్. కాగజు నగర్./ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తమకు రావాల్సిన ఒక నెల వేతనాన్ని వెంటనే చెల్లించాలని మున్సిపల్ కార్మికులు చైర్మన్, కమిషనర్‌లను కోరినప్పటికీ సానుకూల స్పందన రాకపోవడంతో ఆందోళనకు దిగారు.గత మూడు రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు అక్కడే నిద్రిస్తూ నిరసన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ రోజు మున్సిపల్ కార్యాలయంలోకి కమిషనర్ వెళ్లకుండా కార్మికులు అడ్డుకున్నారు.దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళన చేస్తున్న కార్మికులతో మాట్లాడి వారిని శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించారు.దసరా పండుగ వేళ తమ వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తుండటంతో సమస్య పరిష్కారంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ , వ్యాసరచన పోటీలకు ఆహ్వానం
- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటేందుకు విద్యార్థులు, ఔత్సాహికులకు అవకాశం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్, నల్గొండ. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందించిన తీరు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అందించిన సేవలు, పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పే అంశాలపై 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫోటోలు, మూడు నిమిషాల నిడివి గల షార్ట్‌ఫిల్మ్‌లను ఈ నెల 28వ తేదీలోగా https://forms.gle/g VpPmmWFrWZNNRBF6 లింక్ ద్వారా సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర, డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై, డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర అనే అంశాలపై తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 500 పదాలకు మించకుండా పేపర్‌పై రాసిన వ్యాసాన్ని ఫోటో లేదా పీడీఎఫ్ రూపంలో https://forms.gle/YkeKUscWu5LFYWFH7□ లింక్ ద్వారా అక్టోబర్ 26వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడంతోపాటు జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ గురి

- ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మైలార్ దేవ్ పల్లి,కాటేదాన్ బిజెపి నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి,కాటేదాన్ డివిజన్ల నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల విజయానికి ముందస్తు ప్రణాళిక,బూత్ స్థాయి బలోపేతం కీలకమని పేర్కొంటూ,ప్రతి నాయకుడు,కార్యకర్తకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు సమష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు.సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి,కాటేదాన్ డివిజన్ల అధ్యక్షులు పాండు యాదవ్,అడికే జనార్ధన్‌తో, వి.లక్ష్మి,నవారు మురళీధర్, అంజమ్మ,రవి,నాగమణి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- రోడ్లపై అస్తవ్యస్త పార్కింగ్ కు చెక్ .
- ఆటో, జీప్ డ్రైవర్లకు ఎస్ ఐ చంద్రకుమార్ హెచ్చరిక

ప్రజా వాయిస్, సుల్తానాబాద్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతూ, రాకపోకలకు అంతరాయం కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆటో, జీప్ డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పట్టణంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా రహదారులను విస్తరించినప్పటికీ, కొందరు వాహనదారులు రోడ్లపై అస్తవ్యస్తంగా వాహనాలను పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ఇతర వాహనదారులతో పాటు ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇకపై రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అదేవిధంగా రేగడి మద్దికుంట, కొలనూర్, పెగడపల్లి, కాల్వ శ్రీరాంపూర్, గట్టేపల్లి, నీరుకుళ్ల, కదంబాపూర్ గ్రామాలకు వెళ్లే ఆటోలకు నిర్దేశిత ప్రాంతాలను కేటాయించినట్లు తెలిపారు. డ్రైవర్లందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆటో, జీప్ డ్రైవర్లతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లపై తాగునీటి వరదలు

- సామాన్య ప్రజలపై బిల్లుల భారం
- అమీన్ పూర్ భరత్ నగర్ లో నీటి వృథా బాగోతం
- భారత్ పెట్రోల్ బంక్ పక్కనే పైపులైన్ లీకేజీ
- హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు
- ఏఈ పూర్ణేశ్వరి పరిధిలో సమస్య
- మరమ్మతులు ఎప్పుడు

పటాన్ చెరువు ప్రజా వాయిస్ ప్రజలకు సరిపడా తాగునీరు అందించాల్సిన బాధ్యత ఒకవైపు.. ప్రతి నీటి బొట్టునూ కాపాడాల్సిన బాధ్యత మరోవైపు! కానీ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని భరత్‌నగర్ ప్రాంతంలో, భారత్ పెట్రోల్ బంక్ పక్కనే తాగునీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలోని ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

లీటరుకు బిల్లు.. వృథా నీటికి లెక్కేది?

సామాన్య ప్రజలు వినియోగించిన నీటికి బిల్లులు చెల్లిస్తున్నారు. మరి రోడ్లపై వృథాగా పారిపోతున్న నీటికి ఎవరు లెక్క చెబుతారు? ఈ నీటి నష్టానికి బాధ్యత ఎవరిది? పైపులైన్ లీకేజీలను గుర్తించి సకాలంలో మరమ్మతులు చేపట్టాల్సిన వ్యవస్థ ఉన్నప్పటికీ, ఇలాంటి పరిస్థితులు ఎందుకు కొనసాగుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీటి ప్రతి బొట్టుకూ విలువ ఉందని చెప్పే అధికారులు.. కళ్ల ముందే వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వెల్లడించాలి.

ఏఈ పూర్ణేశ్వరి పరిధిలో సమస్య.. స్పందన ఏది?

భరత్‌నగర్ ప్రాంతం సంబంధిత ఏఈ పూర్ణేశ్వరి పరిధిలోకి వస్తున్న నేపథ్యంలో, అక్కడి నీటి సరఫరా పైపులైన్ల పరిస్థితి, లీకేజీలపై తీసుకుంటున్న చర్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ సమస్యపై ఫిర్యాదులు చేసినప్పటికీ పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తే, ఆ ఫిర్యాదులపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, లీకేజీని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా.. బాధ్యత ఎవరిది?

ఒకవైపు నీటి సరఫరా, నిర్వహణ కోసం ప్రజాధనం ఖర్చు చేస్తుండగా, మరోవైపు సరఫరా అవుతున్న తాగునీరు లీకేజీల ద్వారా వృథా కావడం ఆందోళన కలిగిస్తోంది. నీటి వృథా ఎంత జరుగుతోంది? లీకేజీ ఎప్పటి నుంచి ఉంది? మరమ్మతులు ఎందుకు చేపట్టలేదు? సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పుడు పరిశీలిస్తారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించేనా?

భరత్‌నగర్‌లోని భారత్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న నీటి లీకేజీని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి బొట్టుకు విలువనిచ్చే పాలనలో.. రోడ్లపై వృథాగా పారే నీటికి కూడా బాధ్యత వహించాల్సిన సమయం ఆసన్నమైంది.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి

- సవాలుతో కూడిన వీబీఏసీ ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందం.
- డాక్టర్ స్పందన బృందానికి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగయ్య అభినందనలు

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వైద్యులు నాణ్యమైన వైద్య సేవలందిస్తూ ప్రతిభ చాటుతున్నారు. గతంలో సిజేరియన్ ద్వారా ప్రసవమైన మహిళకు మరోసారి సాధారణ ప్రసవం చేయడం వైద్యపరంగా సవాలుతో కూడుకున్నప్పటికీ, ఏరియా ఆస్పత్రి గైనకాలజీ విభాగం వైద్యులు విజయవంతంగా వీబీఏసీ (VBAC) ప్రసవం నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ కోటి స్పందన ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించింది. 36 వారాల గర్భధారణ సమయంలో మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. జన్మించిన శిశువు బరువు రెండు కిలోలు ఉండటంతో మెరుగైన వైద్య పర్యవేక్షణ కోసం ఎన్ఐసీయూ (NICU)లో ఉంచినట్లు డాక్టర్ ప్రవీణ్, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ రంగయ్య తెలిపారు. గతంలో సిజేరియన్ చేయించుకున్న మహిళకు తిరిగి యోని మార్గం ద్వారా సాధారణ ప్రసవం జరగడాన్ని వీబీఏసీ అంటారని, తగిన వైద్య పరీక్షలు, జాగ్రత్తలతో ఇటువంటి ప్రసవాలను నిర్వహిస్తారని వైద్యులు పేర్కొన్నారు. సవాలుతో కూడిన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ స్పందనతో పాటు గైనకాలజీ విభాగం వైద్య బృందానికి డాక్టర్ రంగయ్య శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు అందిస్తున్న సేవలు, విజయవంతంగా నిర్వహిస్తున్న చికిత్సలు ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఈ నార్మల్ డెలివరీ కి సహకరించిన ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

చెరువులో గతంలో నిర్మించిన బేస్మెంట్ తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

చెరువులో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్

పీరం చెరువుకు కంచె.. కబ్జాదారులకు చెక్ ఎక్కడ.?

- రూ.735 కోట్ల విలువైన భూమిపై సర్వే ఏది.?
- ఆక్రమణల తొలగింపు ఏది.?
- ఫెన్సింగ్ పనుల్లో హడావుడి
- భూమి స్వాధీనంలో జాప్యమెందుకు.?
- అధికారుల తీరుపై బీజేపీ నేత కొండే మహేష్ యాదవ్ ధ్వజం

ప్రజావాయిస్// రాజేంద్రనగర్: చెరువు చుట్టూ కంచె కనిపిస్తే సరిపోతుందా.? చెరువు భూమిని కబ్జాల నుంచి కాపాడినప్పుడే అసలైన పరిరక్షణ కాదా.? గండిపేట మండలంలోని పీరం చెరువు విషయంలో అధికారుల చర్యలపై ఇప్పుడు అనేక ప్రశ్నలను వినిపిస్తున్నాయి. ఆక్రమణలపై సమగ్ర సర్వే, హద్దుల నిర్ధారణ,భూమి స్వాధీనం వంటి కీలక చర్యలపై స్పష్టత లేకుండానే ఫెన్సింగ్ పనులు చేపట్టడంపై హైదర్‌షాకోట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండే మహేష్ యాదవ్ తీవ్రంగా స్పందించారు.పీరం చెరువు సర్వే నంబర్ 10 పరిధిలోని 34.29 ఎకరాల్లో 14.29 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గతంలో గుర్తించారని,ఆ భూమి విలువ సుమారు రూ.735 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారని మహేష్ యాదవ్ తెలిపారు. ఇంతటి విలువైన చెరువు భూమిపై ఆక్రమణల ఆరోపణలు ఉన్నప్పుడు అధికారులు ముందుగా పూర్తిస్థాయి సర్వే నిర్వహించి,వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకునే విషయంలో పురోగతి ఏమిటో వెల్లడించకుండా ఫెన్సింగ్ పనులకే ప్రాధాన్యం ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.పేదల ఇళ్లపై చర్యల్లో వేగం,పెద్ద ఆక్రమణల విషయంలో మౌనమెందుకు.? సామాన్యుల విషయంలో కఠినంగా వ్యవహరించే యంత్రాంగం,కోట్ల రూపాయల విలువైన చెరువు భూముల ఆక్రమణల విషయంలోనూ అదే నిబద్ధత చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు చెరువు భూమి ఎంత ఆక్రమణకు గురైంది.? ఎవరి ఆధీనంలో ఉంది.? ఆక్రమణలు తొలగించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.? భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రణాళిక ఏమిటి.? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా కంచె నిర్మాణంతోనే పరిరక్షణ పూర్తయిందని ఎలా భావిస్తారని ప్రశ్నించారు.గతంలో చెరువు బఫర్ జోన్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులు అడ్డుకుని, బేస్‌మెంట్‌ను తొలగించినట్లు ఆయన గుర్తుచేశారు.మరి చెరువు పరిధిలో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారు.? నిర్మాణ అనుమతులు ఇచ్చిన శాఖలు చెరువు హద్దులను పరిశీలించాయా.? ఆక్రమణలు జరిగి ఉంటే వాటిని గుర్తించడంలో సంబంధిత విభాగాలు ఎందుకు విఫలమయ్యాయి.? అన్న అంశాలపై విచారణ జరగాలని కోరారు. స్వలాభం కోసం కంచె వేస్తున్నారనే అనుమానాలకు తావివ్వొద్దు.! చెరువు భూముల విషయంలో పారదర్శకత పాటించి, ఇరిగేషన్,రెవెన్యూ, మున్సిపల్ శాఖలు,హైడ్రా సంయుక్తంగా సర్వే నిర్వహించాలని మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు.కంచె నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తున్నారు.? అసలు చెరువు హద్దులు ఎక్కడున్నాయి.? ఆక్రమిత భూమి స్వాధీనం కోసం తీసుకున్న చర్యలేమిటి.? అనే వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరారు.చెరువు చుట్టూ కంచె వేయడం ప్రభుత్వ బాధ్యతలో ఒక భాగం మాత్రమే..చెరువు భూమిని కబ్జాల నుంచి విడిపించి కాపాడటమే అసలైన బాధ్యత.ఫెన్సింగ్ పనులు చూపించి అసలు ఆక్రమణల అంశాన్ని పక్కనపెడితే ప్రజలకు సమాధానం చెప్పాల్సింది అధికారులే అని ఆయన పేర్కొన్నారు.

దేవాలయ భూములకి ఎసరు..!

- జోరుగా అక్రమ నిర్మాణాలు...
- అనుమతులు లేకుండానే కన్వెన్షన్ హాల్, గోదాము, విల్లాల నిర్మాణాలు?
- అధికారులకు ఫిర్యాదు చేసిన రామాలయ మాజీ చైర్మన్ పెండం లక్ష్మీనారాయణ

మేడ్చల్ జిల్లా, శామీర్ పేట / ప్రజా వాయిస్: దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు అందింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, మల్కాజిగిరి జోన్ పరిధిలోని శామీర్‌పేట డివిజన్, కీసర సర్కిల్ పరిధిలో ఉన్న దేవాలయంజాల్ గ్రామంలోని ప్రభుత్వ భూమి (దేవాలయ భూమి) లో ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక రామాలయ మాజీ చైర్మన్ పెండం లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కీసర ఆర్డీవో వెంకట్ రెడ్డి, కీసర సర్కిల్ డీసీ రామలింగం, శామీర్‌పేట తహసీల్దార్ శ్రీనివాస్‌లకు ఆయన వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. దేవాలయంజాల్ గ్రామ పరిధిలోని దేవాలయ భూమికి సంబంధించిన సర్వే నంబర్ 63లో అక్రమంగా కన్వెన్షన్ హాల్, గోదాము, రెండు విల్లాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపాలిటీతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే భారీ స్థాయిలో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.అధికారులు తక్షణమే స్పందించాలి దేవాలయ భూముల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పెండం లక్ష్మీనారాయణ కోరారు. నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భూమి హక్కులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ నిర్మాణాలు జరిగినట్లు విచారణలో తేలితే వాటిని తొలగించి, దేవాలయ భూమిని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వ, దేవాలయ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. దేవాలయ భూముల పరిరక్షణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గూడు కోసం గోస.. పొంగులేటి భరోసా!

- హిమాయత్ నగర్ 60 గజాల బాధితుల ఆకలి దీక్షకు విరామం
- ఎట్టకేలకు ఆశల ఆరంభం
- 100 రోజులకు పైగా ఎండనక.. వాననక.. పండుగలనూ పక్కనపెట్టి న్యాయం కోసం నిరాహార దీక్ష
- భీం భరత్ చొరవతో రెవెన్యూ మంత్రితో భేటీ
- హామీతో దీక్ష విరమించిన బాధితులు

మొయినాబాద్ (ప్రజావాయిస్): గూడు కోసం గుండె ఘోష.. న్యాయం కోసం అలుపెరుగని పోరు! వంద రోజులకు పైగా ఎండనక.. వాననక.. పండుగలనూ లెక్కచేయకుండా నిరాహార దీక్ష సాగించిన హిమాయత్‌నగర్ 60 గజాల బాధితులకు ఎట్టకేలకు భరోసా లభించింది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 151లోని 60 గజాల స్థలాల సమస్యపై పోరాడుతున్న బాధితులు శుక్రవారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు.

పేదల గోడు.. మంత్రి దృష్టికి!

తమ సమస్యను, ఆర్థిక ఇబ్బందులను, వంద రోజులకు పైగా న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని బాధితులు మంత్రికి వివరించారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల ఆవేదనను భీం భరత్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

పొంగులేటి హామీ.. బాధితుల్లో కొత్త ఆశలు!

బాధితుల విన్నపాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. హిమాయత్‌నగర్ 60 గజాల బాధితులకు అతి త్వరలో న్యాయం జరిగేలా చూస్తామని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశ బాధితుల్లో చిగురించింది.

భీం భరత్ చొరవతో దీక్షకు విరామం!

మంత్రి హామీ అనంతరం భీం భరత్ దీక్షా స్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. మంత్రితో జరిగిన భేటీ వివరాలను వారికి తెలియజేసి, దీక్ష విరమించాలని కోరారు. దీంతో వంద రోజులకు పైగా కొనసాగుతున్న నిరాహార దీక్షను బాధితులు విరమించారు. తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, హామీ లభించేలా కృషి చేసిన భీం భరత్‌కు బాధితుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, హిమాయత్ నగర్ గ్రామస్తులున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కేటీఆర్ విమర్శలు

సింగరేణి కార్మికులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి
రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రజా వాయిస్,గోదావరిఖని :
రాజకీయ లబ్ధి కోసమే కేటీఆర్ విమర్శలు చేస్తున్నాడని, సింగరేణి కార్మికులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలనీ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ డిమాండ్ చేశారు.శుక్రవారం గోదావరిఖని లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ..గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని,సింగరేణి కార్మికుల హక్కులు, తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడిన నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు.సింగరేణి కార్మికులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు 34 శాతం లాభాల వాటా,మారుపేర్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న కేటీఆర్, గతంలో అధికారంలో ఉన్నప్పుడు వారి సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్మికుల త్యాగాలను, వారి కుటుంబాల బాధలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని, సింగరేణి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని

విమర్శించారు.సింగరేణి ప్రాంత ప్రజల కష్టార్జిత సొమ్ముతో సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలను అభివృద్ధి చేసుకొని, రామగుండం ప్రాంతాన్ని మాత్రం నిర్లక్ష్యం చేసి బొందలగడ్డగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు.

సోనాలలో తొలిసారిగా అంగరంగ వైభవంగా దుర్గామాత పల్లకి ఊరేగింపు

ప్రజా వాయిస్. సోనాల
బోత్ నియోజకవర్గంలోని సోనాల మండల కేంద్రంలో తొలిసారిగా దుర్గామాత పల్లకి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పల్లకి ఊరేగింపుతో గ్రామ పురవీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, జై దుర్గామాత నామస్మరణతో గ్రామమంతా భక్తిమయంగా మారింది.ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళహారతులతో అమ్మవారికి ఘన స్వాగతం పలికి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. పల్లకి ఊరేగింపు అనంతరం కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేక

పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దుర్గామాత స్వాములు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళహారతులు, అమ్మవారి నామస్మరణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.దుర్గామాత పల్లకి ఊరేగింపు, కుంకుమార్చన కార్యక్రమాలు సోనాల గ్రామ ఆధ్యాత్మిక చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయి. భక్తి, సంప్రదాయం, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు గ్రామ ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటి సభ్యులు,మహిళా భక్తులు,గ్రామ ప్రజలు,పెద్దలు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఆల్ టైమ్ రికార్డు..

తొలిసారిగా 20,000 మెగావాట్లు దాటి...

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. అక్టోబర్ 15, 2026 ఉదయం 10:29 గంటలకు రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధికంగా 20,003 మెగావాట్ల (వీఖ) గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది.గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) నమోదైన 18,548 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇది ఏకంగా 1,455 మెగావాట్లు ఎక్కువ కావడం గమనార్హం. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం విద్యుత్ వినియోగం 334.54 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. అక్టోబర్ 1 నుండి 15 వరకు సగటు దినసరి గరిష్ట డిమాండ్ 19,289 మెగావాట్లుగా, సగటు విద్యుత్ వినియోగం 321.34 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (TGSPDCL) **పరిధిలో రికార్డులు**
టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో అక్టోబర్ 15న గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,281 మెగావాట్లకు చేరగా, దినసరి విద్యుత్ వినియోగం 228.14 మిలియన్ యూనిట్లకు తాకింది. ఇది గతేడాది గరిష్ట దినసరి వినియోగం (222.34 వీఖ)తో పోలిస్తే 5.80 మిలియన్ యూనిట్లు ఎక్కువ. ఇక రాజధాని హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ (+నవీజ) పరిధిలో అక్టోబర్ 15న సాయంత్రం 6:19 గంటలకు గరిష్ట డిమాండ్ 4,220 మెగావాట్లకు చేరుకుంది. గతేడాది అక్టోబర్‌లో నమోదైన 3,552 మెగావాట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. నగరంలో గృహ, వాణిజ్య, ఐటీ మరియు పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడం, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా కూలింగ్ పరికరాల వాడకం విపరీతంగా పెరగడమే ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు తెలిపారు.

విద్యుత్, నీటి పొదుపునకు పిలుపు:
పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా గ్రిడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భూగర్భ జలాలు పడిపోవడం వల్ల బోర్వెల్స్, వ్యవసాయ పంపుసెట్లపై ఆధారపడటం పెరిగిందని, ఇది గ్రిడ్‌పై అదనపు భారాన్ని మోపుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వినియోగదారులు విద్యుత్‌ను విచక్షణతో వాడాలని, అలాగే నీటిని పొదుపు చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల కోసం 'పొలం బాట' కార్యక్రమం...
వ్యవసాయ రంగానికి విద్యుత్ అత్యంత కీలకం కావడం గమనించిన పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గత వారంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారుల బృందాలు 'పొలం బాట'పేరుతో ఉదయం పూట గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. భూగర్భ జల మట్టాలు, మోటార్ల పనితీరు, పంటల ఆరోగ్యాన్ని నేరుగా పరిశీలిస్తూ.. లో-వోల్టేజ్, లైన్ ఫాల్ట్స్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరిస్తున్నాయి. సాగుకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తున్న ఈ రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇంజనీర్లు, ఫీల్డ్ సిబ్బందిని ఎండీ జితేష్ వి. పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న సంగారెడ్డి కింది బజార్ చెరువు కట్ట

- ఏర్పాట్లను పరిశీలించిన టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- బతుకమ్మ కోసం 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పరిశీలించారు. కట్ట పొడవునా చేపడుతున్న విద్యుద్దీపాలంకరణ, కట్ట

అంచుల్లో బారికేడ్ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసారి బతుకమ్మల నిమజ్జనం కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నామని, మెట్లకు రంగులు వేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో సహా మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 32 అడుగుల స్క్రీన్, లేజర్ లైటింగ్‌తో పాటు చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి కూన సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా కళ్యాణలక్ష్మి పథకం

ప్రజా వాయిస్ సొనాల
బోథ్, సోనాల మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం చెక్కులు అందజేశారు. బోథ్ మండల కేంద్రంలోని

రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్ మండలానికి చెందిన 17 మంది, సోనాల మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు కలిపి మొత్తం 25 కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కళ్యాణలక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రారంభించారన్నారు.. పేద ప్రజల సంక్షేమం, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచులు రాజు రెడ్డి, రూప్చంద్, సంజయ్, బాబులాల్, అంబాజి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, విడిసి చైర్మన్ పోతన్న, నాయకులు పట్టణ అధ్యక్షులు ప్రశాంత్, యూత్ అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు రాకేష్ రెడ్డి, సంజీవ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మతో సామాజిక చైతన్యం

విమలక్క, కళాబృందానికి గుండవేణ స్వామి ఆతిథ్యం

ప్రజా వాయిస్ పెద్దపల్లి
బహుజన బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లికి వచ్చిన అరుణోదయ విమలక్క తన ఆహ్వానం మేరకు పెద్దకల్వల గ్రామానికి చెందిన గుండవేణ స్వామి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమలక్కతో పాటు ఆమె కళాబృందానికి, కార్యక్రమానికి సహకరించిన పెద్దకల్వల గ్రామ ప్రజలకు గుండవేణ స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుండవేణ స్వామి మాట్లాడుతూ.. విమలక్క తన పాటల ద్వారా బహుజన వర్గాల్లో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూ, ప్రజల్లో ధైర్యాన్ని నింపుతున్నారని అన్నారు. బహుజన బతుకమ్మ కార్యక్రమం కోసం ఆమె పెద్దపల్లికి రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మను జరుపుకునే సంప్రదాయం మన సంస్కృతిలో భాగమని, అయితే స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని విధ్వంసం చేసే చర్యలను అరికట్టాల్సిన అవసరం ఉందని గుండవేణ స్వామి అభిప్రాయపడ్డారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు నేటి తరం యువతకు అవసరమైన సహకారం అందించాలని ఆకాంక్షించారు. అనంతరం విమలక్క కళాబృందానికి గుండవేణ స్వామి రాత్రి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ ఆతిథ్యానికి విమలక్క ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ప్రజావాయిస్/వికారాబాద్:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీస్ సిబ్బంది ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం ద్వారా పరస్పర స్నేహభావం, ఐక్యత మరింత బలపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు

ప్రజా వాయిస్ దంతాలపల్లి అక్టోబర్16
మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ కవిత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో ఉల్లాసంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత సూపర్వైజర్స్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతలు ఎందుకు?

- రైతులకు విద్యుత్, ఎరువులు, పంటల విక్రయాల్లో కష్టాలు
- రేవంత్ సర్కార్ పాలనలో పూర్తిగా గాడి తప్పిన వ్యవస్థ
- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- వికారాబాద్, ధరూర్ లలో బిఆర్ఎస్ నాయకుల మీడియా సమావేశం

ప్రజావాయిస్/వికారాబాద్:
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైనప్పుడు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు సాధ్యపడటం లేదని బిఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, ధరూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కరెంట్ కోతలతో పాటు ఎరువుల కొరత, పండించిన పంటలను విక్రయించడంలోనూ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రేవంత్ సర్కార్ తెలంగాణలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేస్తూ, రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం సిబ్బంది ధర్నా..

బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని మద్దతు..

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేతులకు నల్ల రిబ్బన్లు కట్టి, బతుకమ్మలతో నిరసన

కాంట్రాక్ట్ సిబ్బంది న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించిన చిట్యాల సుహాసిని..

ప్రజా వాయిస్. ఆదిలాబాద్
నేషనల్ హెల్త్ మిషన్ (చీఎవీ) పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఐవీఙా) కార్యాలయం ముందర చేపట్టిన నిరసన ధర్నా బుధవారం కొనసాగింది.ఇందులో భాగంగా మహిళా ఉద్యోగినుల ఆధ్వర్యంలో చేతులకు నల్ల రిబ్బన్లు ధరించి, బతుకమ్మలు ఆడుతూ వినూత్న

రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని హాజరై ఉద్యోగులకు పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా చిట్యాల సుహాసిని మాట్లాడుతూ... ఏళ్ల తరబడి ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నామమాత్రపు వేతనాలతో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి సమస్యలను పరిష్కరించేంత వరకు వారి పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా ఉద్యోగినులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికల విద్యకు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

దేవరుప్పుల కేజీబీవీలో రూ.56 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని

ప్రజావాయిస్ / దేవరుప్పుల:
బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 56 లక్షల వ్యయంతో చేపట్టనున్న మొదటి అంతస్తు మిగులు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్, జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి, ఎస్ఓ రజిత, జీసీడీఓ గౌసియా, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ విభాగాల మండల అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్, మహ్మద్ రసూల్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు.

దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- ఆరవ వార్డులో అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్
- కౌన్సిలర్ భాకం సాయికిరణ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
దుర్గామాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆకాంక్షించారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి

ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. పండుగలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆరవ వార్డుకు చెందిన మహిళలు తమ సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్‌కు సూచించారు. అనంతరం కౌన్సిలర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, రాకేష్‌రెడ్డి, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వరప్రదీప్, తొర్రికొండ ప్రభాకర్, మాజీ వార్డు సభ్యుడు అమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు గాదాసు రవీందర్, బీజేపీ నేత కందునూరి కుమార్, ఆరవ వార్డు కాంగ్రెస్ సీనియర్ నాయకులు న్యాతరి శ్యాంసుందర్, మామిడిపల్లి శ్రీకాంత్, న్యాతరి దేవేందర్‌కుమార్, ఆరేపల్లి కిరణ్, ఆరేపల్లి హేమన్‌రాజు, న్యాతరి దుర్గయ్య, ఉత్సవ నిర్వాహకుడు ఆరేపల్లి రాకేష్‌తో పాటు వార్డు మహిళలు లలిత తదితరులు పాల్గొన్నారు.

బట్వాన్‌పల్లిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సర్పంచ్ సింగతి రాజేష్ (న్యాయ వాది)చేతుల మీదుగా కార్డుల అందజేత

ప్రజా వాయిస్ . బెల్లంపల్లి రూరల్
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో ఈరోజు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సింగతి రాజేష్ తన చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేషన్ కార్డులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను పొందేందుకు రేషన్ కార్డులు కీలకమని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం ద్వారా పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా కృషి చేయాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చూడాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్, గోమాస ప్రభాకర్, చింతం వెంకటస్వామి, మాజీ సర్పంచులు దుర్గం ఝాన్సీ,వెంకటస్వామి రామటేంకి నిర్మల, హరి కృష్ణ , గ్రామ ఉపసర్పంచ్ కొప్పుల అశోక్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు పంజాల పవిత్ర, దుర్గం సుమంతి, రామటేంకి సరిత, చల్లూరి వెంకటేష్, గంగాధరి అంకులు, చదువుల వెంకటరమణ, గ్రామ కార్యదర్శి మహేష్, రేషన్ డీలర్ గోనె శేఖర్, కాశీరామ్, అయిల్ల రాజన్న తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలి

ఈ నెల 30న సభ..
టీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి బోడ జనార్ధన్ పిలుపు

ప్రజా వాయిస్ ఇంద్రవెల్లి.
ఈ నెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మరియు మాజీ మంత్రి బోడ జనార్ధన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా గురువారం రాథోడ్ బాపురావు వివిధ జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలతో కలిసి నాగోబా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సమావేశంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సభ నిర్వహణపై చర్చించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక నియోజకవర్గాల్లో పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణకు మహిళా ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల కవిత ఎన్నిక కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. పాంచజన్య సంకల్ప సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్ధన్, సభ పర్యవేక్షకురాలు లలిత, విక్రాంత్ రెడ్డి, ఖానాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం దయాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి మాడవి బాపురావు, ఆదిలాబాద్

అసెంబ్లీ ఇన్‌చార్జి వేణుగోపాల్ యాదవ్‌తో పాటు వివిధ జిల్లాల ఇన్‌చార్జిలు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసింది కేసీఆరే..!

- గోదావరి జలాలున్నా సాగునీరు అందకపోవడం బాధాకరం..
- రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు న్యాయం చేయాలి
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రజా వాయిస్/దుబ్బాక:
పేదలకు పైసా ఖర్చు లేకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి అందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గం లోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీని మండలాల వారీగా చేపడితే లబ్ధిదారులకు సౌకర్యంగా ఉంటుందని సూచించారు. ఇప్పటికే ఇళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. గోదావరి జలాలున్నా రైతులకు సాగునీరు

అందకపోవడం బాధాకరం అని అన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో గోదావరి జలాలతో కూడవెల్లి వాగు జీవనదిగా మారిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాలతో చెరువులు, కాలువలు కళకళలాడేవని, మండుటెండల్లోనూ పంటలకు సాగునీరు అందేదని తెలిపారు. ప్రస్తుతం గోదావరి పొంగిపొర్లుతున్నా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోసే మోటార్లు ఆన్ చేయకపోవడం, సాగునీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు కనీసం 15 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ఇప్పటికే మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రైతుల నినాదాలు.. మంత్రి సమక్షంలో సమస్యలను వివరించిన ఎమ్మెల్యే మంత్రి వివేక్ వెంకటస్వామి కార్యక్రమానికి వస్తున్న సమయంలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతులు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులతో మాట్లాడి, వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులతో కలిసి వినతిపత్రం అందజేసి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలనీ అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి అవసరమైన మేరకు సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని, కనీసం 15 గంటల విద్యుత్ అందించి రైతులకు అండగా నిలవాలని కోరారు. పేదలకు ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలోనూ రైతుల కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, సాగునీరు, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ పండుగలో ఆడపడుచులతో బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత సందడి

ప్రజా వాయిస్ / బొమ్మలరామారం:
యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల తహసిల్దార్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యాలయ మహిళా ఉద్యోగులు, మహిళా సర్పంచులు, స్థానిక మహిళలతో కలిసి బీర్ల అనిత ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాధ , ఎంపీడీవో శ్యామల, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, ఎఎంసి చైర్మన్ ఐనాల చైతన్య రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ సింగిర్తి మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగడ్ల సుధాకర్ , శ్రీరామ్ నాయక్, మైలారం సుదర్శన్, మన్నెం నరేందర్ రెడ్డి , మర్రి భగవంత రెడ్డి, అగం రెడ్డి , రాజు నాయక్ , శ్రీకాంత్ రెడ్డి , మహిళా నాయకురాలు ,పావని, కవిత, సునీత, కళ, పలువురు సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, , తదితరులు పాల్గొన్నారు

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సన్మానం

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.
భీమదేవరపల్లి మండల ప్రెస్ క్లబ్ (రి.నెం. 629/22) నూతన కార్యవర్గాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మాడుగుల రాజకుమార్, ప్రధాన కార్యదర్శి మాడుగుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గౌడ చంద్రబాబులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రెస్ క్లబ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, దిలీప్, ప్రవీణ్, రమేష్, ప్రణయ్, మధుకర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి..

గౌరవ అధ్యక్షుడు" మచ్చ" కు సన్మానం

ప్రజా వాయిస్ /దుబ్బాక :

దుబ్బాక ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్మిక, ఉపాధి, శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తామని మచ్చ శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక డిపోకు అదనంగా మరో పది బస్సులు తీసుకురావడంతో పాటు శాశ్వత డిపో మేనేజర్ నియమించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలిచి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ డిపో అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానానికి ఆదిదేవత... జగన్మాత శ్రీ విద్యాసరస్వతి

- సర్వ శక్తి సామర్థ్యాలను ప్రసాదించనున్న శ్రీ విద్యాధరి
- క్షేత్రంలో వైభవంగా మూలా నక్షత్ర వైభవం
- పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర నృసింహ భారతి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

జ్ఞానానికి ఆదిదేవతగా జగన్మాత శ్రీ విద్యా సరస్వతి మాత ప్రసిద్ధికెక్కినట్లు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర నృసింహ భారతి స్వామీజీ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర మహోత్సవం సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే శ్రీ విద్యాధరి క్షేత్రం భక్తులు, ఆరాధకులకు ఆకర్షణగా విలసిల్లుతోందని స్పష్టం చేశారు. జ్ఞాన సముపార్జనకు చదువుల తల్లి సంపూర్ణ ఆశీస్సులు పొందాలని, దీంతో విద్య, నైపుణ్యత, సృజనాత్మకత తదితర లక్ష్యసాధనకు మార్గం సుగమం చేసుకోవాలని ఆకాంక్షించారు. శక్తి స్వరూపంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ విద్యాధరి క్షేత్రశీ సర్వశక్తి సామర్థ్యాలను ప్రసాదిస్తుందని, ఈ క్రమంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించాలని వివరించారు. కాగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. మూలా నక్షత్ర మహోత్సవం పురస్కరించుకొని క్షేత్రంలో లక్ష పుష్పార్చన, పుస్తక రూపిని సరస్వతీ పూజ, చండీ హోమము తదితర అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, రెండు వేలకు పైగా అక్షర స్వీకారాలు జరిగినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేయగా, అమ్మవారి నామస్మరణతో క్షేత్ర సముదాయం మార్మోగింది.

వార్డు సభ్యులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేత

గజ్వేల్ రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు గ్రామ పాలన, విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించేలా ఆర్.జీ.ఎస్.ఏ, టీ.జీ.ఐ.ఆర్.డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌కు ఎంపీడీవో చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామపంచాయతీ పాలనకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించిందని గ్రామ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వినియోగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవసరమైన సహకారం అందించి, కార్యక్రమం విజయవంతం కావడంలో తోడ్పడిన దాతర్ పల్లి గ్రామ కార్యదర్శి నాగరాజుకు గ్రామ పాలకవర్గం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పాలపిట్టను బంధిస్తే చట్టపరమైన చర్యలు...

ఫారెస్ట్ బీట్ అధికారి అర్జున్...

ప్రజా వాయిస్, పాపన్నపేట
దసరా సందర్భంగా రాష్ట్ర పక్షి పాలపిట్టను బంధిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ బీట్ అధికారి అర్జున్ హెచ్చరించారు. పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రామ అభివృద్ధి సమీక్షలో మాట్లాడారు. కోతులు, అడవి పందుల బెడద నివారణకు అడవి భూముల అనుమతుల కోసం పంచాయతీ తీర్మానం చేసి జిల్లా అధికారులకు పంపించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల తహసిల్దార్, స్థానిక ఎంపీడీవో, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

రైల్వే లైన్ సాధన కోసం పోస్ట్ కార్డు ఉద్యమం

యువజన కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్ రెడ్డి

గడ్ చందూర్ - బేల - జైనథ్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ పాత మ్యాప్ ప్రకారమే నిర్మించాలని డిమాండ్..

ప్రజా వాయిస్ బేల./ ఆదిలాబాద్
ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సాంగిడి గ్రామంలో ప్రజలను చైతన్యపరిచిన కాంగ్రెస్ శ్రేణులు గడ్ చందూర్ నుండి బేల, జైనథ్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బేల మండలంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు విడుదల చేసిన గెజిట్ ప్రకారమే, మ్యాప్ మార్చకుండా పాత పద్ధతిలోనే ఈ రైల్వే లైన్ నిర్మించాలని కోరుతూ ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి బేల మండలంలోని సాంగిడి గ్రామంలో ప్రజలను చైతన్యపరిచారు.ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ... పాత రూట్‌లోనే రైల్వే లైన్ నిర్మిస్తే ఎంతోమంది నిరుపేదలకు సౌకర్యవంతమైన మరియు తక్కువ ఖర్చుతో కూడిన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించుకునేందుకే ఈ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిమ్మ శేఖర్, మంచికంటి నవనీత్, రవీందర్ పటేల్, విలాస్, వేదాంత్ రెడ్డి, నర్సింగ్, అమోల్, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రైతులు పండించిన ప్రతీ గింజ ప్రభుత్వమే కొనేలా కృషి చేస్తాను..

ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజా వాయిస్ నేరెడిగొండ./బోథ్
నేరడిగొండ మండల కేంద్రంలో నాబార్డ్ వారి తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా, తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి తగిన మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనేలా కృషి చేస్తానన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా, వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్, స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్, సర్పంచులు మహేందర్ రెడ్డి, నవీన్, గంగాధర్, స్వామి, సుజీల్, ప్రతాప్, శోభన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ దంపతులు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రజా వాయిస్ సంగారెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా పోలీసు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.తెలంగాణ ప్రకృతి అందాలు, ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో వేడుకలను జరుపుకున్నారు. సంప్రదాయ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో పోలీసు కుటుంబ సభ్యుల సందడి మధ్య వేడుకలు అంబరాన్నంటాయి.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు నిర్వహించారు. కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

సీఐటీయూలోకి యువ కార్మికుల చేరికలు

సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తాం

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి

ప్రజా వాయిస్ గోదావరిఖని

సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)లోకి రామగుండం-2 ఏరియా ఓసీపీ-3 ప్రాజెక్టుకు చెందిన పలువురు యువ కార్మికులు శుక్రవారం చేరారు. సీఐటీయూ ఆర్జీ-2 ఏరియా బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి నూతన సభ్యులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సీఐటీయూ పనిచేస్తోందని తెలిపారు. యూనియన్ పోరాటాలపై విశ్వాసంతో యువ కార్మికులు చేరడం సంతోషకరమన్నారు. సింగరేణి కార్మికులందరికీ సొంతింటి పథకం సమర్థవంతంగా అమలయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంస్థలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోరాడుతామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో కార్మికుల ఐక్యతను మరింత పెంపొందించి సీఐటీయూను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-3 పిట్ సెక్రటరీ రాంప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీ వినేష్, నాయకులు విజయకుమార్, శ్రీనివాస్, సుమన్, రాజశేఖర్, మల్లేశం, శ్యాంప్రసాద్‌తో పాటు నూతనంగా చేరిన యువ కార్మికులు శ్రీకాంత్, కార్తీక్, ఎండీ యాకూబ్, వంశీ, ఎస్కే యాకూబ్, ఏ. మహేష్, శ్రవణ్, కే. మహేష్, మల్లయ్య, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన ముదిరాజ్ నాయకులకు ఘన సన్మానం

ప్రజా వాయిస్, ఎల్లారెడ్డిపేట/సిరిసిల్ల:

ఎల్లారెడ్డిపేట మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బొప్పాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన దండు శ్రీనివాస్, పాండవుల నగేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెరుమండ్ల అంజయ్య మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను గుర్తించి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా పదవులు కేటాయించి గౌరవించిన ప్రభుత్వ పెద్దలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ముదిరాజ్‌లు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, వివిధ పదవుల్లో ప్రజలకు సేవ చేసే అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జెల్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడు మాచర్ల ఎల్లయ్య, కార్యదర్శి కనకట్ల తిరుపతి, కోశాధికారి బత్తిని శ్రీనివాస్, రైటర్ గడ్డి స్కైలాబ్, ముఖ్య సలహాదారు బోయిని మహాదేవ్, సలహాదారులు పిట్ల బాబు, గుండ్ల రాజయ్య, కంకణాల శేఖర్, గ్రామాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో తలమద్రి గ్రామస్తుల చేరిక

కల్వకుంట్ల కవిత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఆకర్షితులై పార్టీలో చేరిక

ప్రజా వాయిస్ తలమద్రి./ఇచ్చోడ

ఇచ్చోడ మండలం తలమద్రి గ్రామానికి చెందిన పలువురు మహిళలు యువకులు గ్రామస్తులు స్వచ్ఛందంగాలి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలంగాణ రక్షణ సేన టి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గ్రామస్తులకు లిరాథోడ్ బాపురావు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనిలి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఈర్ల రాజు నియామకం

డివిజన్ లో బిజెపి బలోపేతానికి కృషి చేస్తా

పటాన్‌చెరు ప్రజావాయిస్

భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో తనను బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమించినందుకు ఈర్ల రాజు ముదిరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బీరంగూడ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుఎమ్మెల్సీ చినమైల్ అంజిరెడ్డి , సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అక్క గారికిలి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్ ,ఎడ్ల రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి సహదేవ్ అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను. బీరంగూడ డివిజన్ పరిధిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడమే నా ప్రధాన లక్ష్యం”లి అని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. బీరంగూడ డివిజన్ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రజలకు, ముఖ్యంగా బీరంగూడ డివిజన్ ప్రజలకు, అమీన్‌పూర్ మండల ప్రజలకు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు తనకు అందిస్తున్న

ప్రేమాభిమానాలు, సహకారం, ప్రోత్సాహానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు సంగారెడ్డి జిల్లాలోని పాత్రికేయ మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. మీ అందరి సహకారం, ఆశీస్సులు, ప్రోత్సాహంతో బీరంగూడ డివిజన్ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి, భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారుఈ సందర్భంగా మరోసారి తనకు సహకరించిన పార్టీ అగ్రనాయకత్వానికి, రాష్ట్ర, జిల్లా నాయకులకు, డివిజన్ నాయకులు, కార్యకర్తలకు, మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మందకృష్ణ మాధిగని కలిసిన అజయ్ తల్లిదండ్రులు

50 రోజులు గడిచినా లభించని అజయ్ ఆచూకీ

అజయ్ తల్లిదండ్రులకు అండగా ఉంటామని మందకృష్ణ మాదిగ హామీ

ప్రజావాయిస్, కీసర:

కన్నబిడ్డ ఆచూకీ తెలియక 50 రోజులుగా ఆందోళన చెందుతున్న కీసర గ్రామానికి చెందిన గందమల అజయ్ కుమార్ తల్లిదండ్రులు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ కుమారుడి ఆచూకీ ఇప్పటివరకు తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని, తమ బిడ్డను క్షేమంగా వెతికి అప్పగించేందుకు సహకరించాలని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా అజయ్ తల్లిదండ్రులు జరిగిన సంఘటనల వివరాలను

మందకృష్ణ మాదిగకు వివరించి, తమ కుమారుడి ఆచూకీ కనుగొనేందుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రుల ఆవేదనను విన్న మందకృష్ణ మాదిగ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. చట్టపరంగా, న్యాయపరంగా అజయ్ ఆచూకీ లభించే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారుల వద్ద కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో, పూర్తి వివరాలను తెలుసుకొని అజయ్ ఆచూకీ కనుగొనేందుకు తగిన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. 50 రోజులుగా కుమారుడి కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు న్యాయం జరగాలని, అజయ్ ఆచూకీ త్వరగా లభించి తమ చెంతకు చేరాలని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్, కీసర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బక్కని జేకే కుమార్ మాదిగ, కీసర మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బుడిగె జగన్, అజయ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రీ సర్వేను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలి

లైసెన్స్డ్ సర్వేయర్లకు కిట్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజా వాయిస్,వరంగల్ చెన్నారావుపేట :

భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను, లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లకు,గ్రామ పాలన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ఒక చారిత్రాత్మక మార్పు అని, భూ సమస్యల పరిష్కారానికి, భూ రికార్డుల ప్రక్షాళనకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో రీ సర్వే కోసం జిల్లా లోని మొత్తం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో 8 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ

పూర్తయిందని వివరించారు. మరో ఆరు గ్రామాల్లో 9(2) నోటీసులు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పరిపాలన అధికారులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా లైసెన్స్ సర్వేయర్లకు కలెక్టర్ మెడికల్ కిట్ తో పాటు,గొడుగు,ప్యాడ్,తదితర 12 రకాల కిట్స్ బ్యాగులను పంపిణీ చేశారు. సర్వేయర్లు పూర్తి స్థాయిలో కృషి చేస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డియార్వో విజయలక్ష్మి,ఏ డి సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు,లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్, మరియు డిప్యూటి తహసీల్దార్లు, లైసెన్డు సర్వేయర్లు,గ్రామపాలన అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అండతో పోలీసుల కక్షసాధింపు చర్యలు ఆగాలి

జోగిపేట సీఐ బిఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులే టార్గెట్గా చేసి బెదిరింపులు

జిల్లా ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే చాంటి క్రాంతి కిరణ్ ఫిర్యాదు

ఆందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, రైతులపై అక్రమ కేసులు

స్టేషన్లకు పిలిపించి కాంగ్రెస్‌లో చేరాలని బెదిరింపులు..

పద్ధతి మార్చుకోకపోతే సహించేది లేదు

తప్పుడు కేసులు, అక్రమ రౌడీషీట్లను వెంటనే రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలి

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాన్య రైతులపై వరుసగా అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చాంటి క్రాంతి కిరణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసుల పక్షపాత వైఖరి, కక్షసాధింపు చర్యలపై సంగారెడ్డి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అధికారికి ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అక్రమ చర్యలను ఎండగట్టారు. జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని అకారణంగా కేసులు పెడుతున్నారు. కన్సన్‌పల్లి మాణిక్ రెడ్డి, ఎర్రారం ప్రవీణ్ రెడ్డి, తడ్కనూర్ సర్పంచ్ అనిల్ రెడ్డి తదితరులపై అక్రమంగా కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. అంతేకాకుండా కార్యకర్తలను అనధికారికంగా పోలీస్ స్టేషన్లకు పిలిపించి, గంటల తరబడి కూర్చోబెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారు. “బీఆర్ఎస్‌లో ఉండి ఏం చేస్తారు? అధికార కాంగ్రెస్ పార్టీలో చేరండి” అంటూ పోలీసులు బాహాటంగా రాజకీయ సలహాలు ఇవ్వడం ఏ చట్టంలో ఉందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేయడానికి వెళ్తే తిరిగి వారిపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని మండిపడ్డారు.

అక్రమ కేసులు - అరెస్టుల :

౨ జోగిపేట: సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నాడనే నెపంతో నవీన్ రెడ్డి అనే కార్యకర్తపై జోగిపేట పీఎస్‌లో తప్పుడు కేసు పెట్టారు. అలాగే అశోక్ అనే వ్యక్తిని సివిల్ దుస్తుల్లో వచ్చి అక్రమంగా నిర్బంధించి, నిలదీసేసరికి చివరకు జహీరాబాద్ స్టేషన్‌లో అరెస్ట్ చూపించారు. వట్ పల్లి మండల్ మేడికుంద గ్రామానికి చెందిన అశోక్ కుమార్, దేవానూర్ గ్రామానికి చిన్నలపై సంబంధం లేని మూడో వ్యక్తితో సోషల్ మీడియా నెపంతో తప్పుడు కేసులు పెట్టించారు. నిర్ణేప్ల గ్రామంలో గ్రామ కంఠం స్థలంలో గుడి కట్టాలని పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేస్తే, కబ్జా చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు సంగయ్య, కృష్ణ, నీలయ్య, వీరారెడ్డి, హన్మంతు, గోపాల్‌లపై అక్రమ కేసులు బనాయించారనీ ఆరోపించారు. బిజిల్‌పూర్‌లో దళితబంధు లబ్ధిదారుడు సదానందం ఉపాధి పొందుతుంటే జేసీబీని సీజ్ చేసి వేధించారు. వట్పల్లిలో పోలింగ్ రోజున కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లపై దాడి చేస్తే, ఫలితాల తర్వాత మారుతి, బాలాజీ, కిషన్, మహేందర్ గౌడ్‌లపైనే ఎదురు కేసులు పెట్టారు. అలాగే పొలంలో మట్టి తవ్వుకున్నందుకు మాడు అనే రైతుపై కేసు నమోదు చేశారన్నారు. మునిపల్లి మండలం మగ్దంపల్లిలో మునీరుద్దీన్, ఎండీ ఏజాజ్, ఎండీ ఇంతియాజ్‌లపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేశారనీ ఆరోపించారు. ఖమ్మంపల్లిలో తుడుం దుర్గయ్య, తుడుం సుభాష్‌లపై కేసులు పెట్టడమే కాకుండా, తాగునీటి బోరు పాయింట్ వేయించి గ్రామాభివృద్ధికి కృషి చేసిన జడ్పీటీసీ భర్త పైతర సాయికుమార్‌పై కక్షపూరితంగా అక్రమంగా రౌడీషీట్ కేసు నామోదు చేశారు. మల్లారెడ్డిపేట్‌లో పొలాల్లోకి మట్టి తరలిస్తున్న వార్డు మెంబర్ సంతోష్ రెడ్డి,

మోహన్, ఈశ్వర్ రెడ్డిలపై అక్రమ కేసులు పెట్టారు. గ్రామీణ రోడ్లు పాడవుతున్నాయని భారీ వాహనాలను ప్రధాన రహదారి గుండా వెళ్లాలని కోరినందుకు ఎస్సీల ఇళ్లపై దుండగులు దాడి చేయగా, బాధితులైన సర్పంచ్ ఈర్లపల్లి రాజు, ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, మహిపాల్, గంగారం, బంటు సురేష్‌లపైనే ఎదురు కేసులు బనాయించారు. బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు ఎల్లప్పుడూ చట్టానికి లోబడే పనిచేస్తున్నారని, భవిష్యత్తులోనూ ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. అయితే పోలీసు యంత్రాంగం అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలా మారి ఈ విధమైన అనారోగ్యకర వాతావరణాన్ని సృష్టిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వెంటనే జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తానని ఎస్ పి హామీ ఇచ్చారు అనీ తెలిపారు. ఉన్నతాధికారితో అన్ని కేసులపై సమగ్ర నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజాప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను, సాయికుమార్‌పై తెరిచిన అక్రమ రౌడీషీట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని చాంటి క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు.

ఆయన కళ్ళు సజీవం

మరణంలో ఇద్దరు అందులకి చూపునిచ్చిన ఇరుముల్ల శ్రీనివాస్

ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని హనుమాన్ బస్తీ కి చెందిన ఇరుముల్ల శ్రీనివాస్ అనారోగ్యంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా జనహిత సేవా సమితి ప్రచార కార్యదర్శి నేత్రదాన కమిటీ బాద్యులు డోలి సుకుమార్ వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి వివరించగా పుట్టెడు దుఃఖంలో ఉండి నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎల్ వి . ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నేత్రదానం లో భాగంగా కార్నియా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ఇరుముల్ల శ్రీనివాస్ మృతి బాధాకరమని పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు వారి కుమారులు ఇరుముల్ల జోషువా, సురేష్, సోదరుడు ఇరుముల శేఖర్ కుటుంబ సభ్యులు నేత్ర దానం ద్వారా ఇద్దరి అందులకి చూపునివ్వాలని నేత్ర దానానికి ముందుకు రావడం అభినందనీయం. అని వీరి స్ఫూర్తితో ప్రజలందరూ మరణానంతరం నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలని అన్నారు. జనహిత సేవా సమితి ద్వారా ఇది 25 వ నేత్రధాన కార్యక్రమం అని కీ.శే. ఇరుముల్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యుల స్ఫూర్తితో ప్రజలందరు మరణించిన తరువాత నేత్ర, అవయవ,శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కంటి భాగం లోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ చిట్యాల మధు ,ఆకుల వేణు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కామ్పల్లి విజయకుమార్ ప్రచార కార్యదర్శి డోలి సుకుమార్, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.నేత్రదానం అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు వారి సర్టిఫికెట్ అందజేయడం జరిగింది.

ట్విట్టర్‌లో కేటీఆర్‌కు ఆడబిడ్డ ఆవేదన

పోచంపల్లి గ్రామంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

సాగునీరు, కరెంట్ లేక ఎండిపోతున్న పంటలు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ధ్వజం

కండ్ల ముందే ఎండిపోతున్న పంటలు

కన్నీరు పెడుతున్న రైతన్న బైరు రమణయ్య

ప్రభుత్వ దుబారా ఖర్చులపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ నిప్పులు

ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు విడ్డూరం బైరు అశ్విని

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం
నల్గొండ జిల్లా,గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన బైరు అశ్విని అనే విద్యార్థిని రైతు సాగునీటి కొరతతో ఎండిపోతున్న తన పంటలను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ క్రమంలోనే ఆమె తన సమస్యను సామాజిక మాధ్యమం 'ఎక్స్' ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.ఆమె ఆవేదనపై కేటీఆర్ తక్షణమే స్పందించారు. గ్రామంలోని పరిస్థితిని స్వయంగా పరిశీలించాల్సిందిగా నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ను ఆదేశించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు నోముల భగత్ వెంటనే పోచంపల్లి గ్రామాన్ని సందర్శించి, ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించారు. బాధితురాలితో పాటు స్థానిక రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే పోచంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, మాజీ వైస్ ఎంపీపీ ధనుంజయ్, సర్పంచులు జక్కల స్వప్న భాస్కర్, అందుగుల శ్రీనయ్య, సాల్వాది నగేష్, సింగం బాలకృష్ణ నాయకులు కుర్మాల్ రెడ్డి కృష్ణగౌడ్,దోటి గణేష్,సిరాజ్, కావల్ల రాములు, ఉపేందర్ రెడ్డి,రామారావు, పోలెని నర్సింహా, పర్వతరెడ్డి,యాదగిరి, కొండ్రపల్లి గిరి, రమణయ్య, భాస్కర్, చంటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ.. హిందూ సంస్కృతి

సంప్రదాయాల పరిరక్షణే మనందరి బాధ్యత

అమీన్పూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు

పటాన్ చెరువు ప్రజావాయిస్
పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండల పరిధిలోని అమీన్పూర్, బీరంగూడ డివిజన్లలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న సందర్భంగా బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.సుల్తాన్‌పూర్ గ్రామంలో దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరంగూడ గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అదేవిధంగా గండిగూడ గ్రామం, పటేల్‌గూడ గ్రామం, సూర్యోదయ కాలనీతో పాటు దుర్గా నగర్ కాలనీకి చెందిన దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఈర్ల రాజు ముదిరాజ్

ఆహ్వాన పత్రికలు అందజేసి, నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసి దుర్గామాత అమ్మవారిని దర్శించుకోవాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం, సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. సనాతన ధర్మం మనకు ధర్మబద్ధమైన జీవనం, సేవాభావం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి ఉన్నతమైన విలువలను బోధిస్తుందని తెలిపారు.దుర్గామాత అమ్మవారి ఆరాధన స్త్రీశక్తికి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా యువతలో భక్తిభావం, సంస్కృతి పట్ల గౌరవం పెంపొందుతాయని అన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో అమీన్పూర్ మండలంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అన్నదాన కార్యక్రమాలు సేవాభావానికి, మానవత్వానికి, సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.ధర్మాన్ని ఆచరిద్దాం సనాతన సంస్కృతిని కాపాడుకుందా దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, ప్రతి హృదయంలో భక్తిభావం వెల్లివిరియాలని కోరుకుందాం.ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులు కొండా లక్ష్మణ్ గారు, అమీన్పూర్ డివిజన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి. మండల నాయకులు శ్రావణ్, జనార్ధన్, రాజమలేష్ , గోపి, మనోహర్ చౌదరి, రతన్ చౌదరితో పాటు బీజేపీ కార్యకర్తలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఉద్యమకారుల పాలాభిషేకం

ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల విజ్ఞప్తి

గుర్తింపు తో హర్షం వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ప్రజా వాయిస్ అక్టోబర్ 16 నాగర్ కర్నూల్
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టడం పట్ల ఉద్యమకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నిర్ణయానికి కృతజ్ఞతగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి మరియు నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగొండ రాము పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, పాలతో అభిషేకం చేసి మిఠాయిలు పంచారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఉద్యమకారులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి, వారికి అధికారిక గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియను మొదలుపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.ఇది తెలంగాణ ఉద్యమకారులందరికీ గర్వకారణమని, రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర, టౌన్ అధ్యక్షులు జక్క రఘు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.అలాగే నర్సాయిపల్లి సర్పంచ్ రాము, సందువట్ల సర్పంచ్ తిరుపతి గౌడ్, నాయకులు మురళి, తదితరులు పాల్గొన్నారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి, అర్హులందరికీ న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని, త్వరలో జిల్లా స్థాయిలో భారీ కృతజ్ఞత సభ ఏర్పాటు చేస్తామని జయప్రకాష్ తెలిపారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌గా ఎలక్షన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజావాయిస్, కీసర:
కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎలక్షన్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ముందుగా కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కీసర పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో విధుల్లో చేరిన ఆయనకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా కృషి చేస్తామని సిఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

- తోట్ల ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

- ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి అమ్మవారి దర్శనం

ప్రజా వాయిస్/వికారాబాద్:
దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి తోట్ల ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తోట్ల ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జగ్గారి రత్నారెడ్డి వారికి శాలువాలు కప్పి సత్కరించి ఆహ్వానం పలికారు. ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రంగరాజు,జగ్గారి వెంకట్ రెడ్డి,సత్యనారాయణ,చిగుళ్లపల్లి రమేష్,సంతోష్ గౌడ్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీలో నిరసన

శేరిపల్లి నుంచి ఢిల్లీ వరకు..

ఓటు హక్కు కోసం పోరాటం: మహేష్ రెడ్డి

ప్రజా వాయిస్ టేక్మాల్ :
ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెదక్ జిల్లా టేక్మాల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మహేష్ రెడ్డి తెలిపారు.ఢిల్లీలోని రాజీవ్ చౌక్ వద్ద ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు శాంతియుతంగా ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లతో పాటు పలువురు నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు లాఠీచార్జి చేశారని ఆరోపించారు.ఈ ఘటనను ఖండిస్తూ పార్లమెంట్ స్ట్రీట్‌లోని సీపీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపినట్లు మహేష్ రెడ్డి వెల్లడించారు. ఓటు చోరీకి పాల్పడుతున్నారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌పై ఆయన విమర్శలు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

లాఠీచార్జిలు, అరెస్టులకు భయపడేది లేదు
ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమాన్ని పోలీసుల లాఠీచార్జిలు, అరెస్టులతో అడ్డుకోలేరని మహేష్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఓటరు హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రెండు మండలాల నూతన ఎస్ఐలు

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యశస్విని రెడ్డిని కలిసిన సృజన్ కుమార్, చింత రాజు

ప్రజా వాయిస్ /పాలకుర్తి /అక్టోబర్ 16
పాలకుర్తి:పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు నూతనంగా నియమితులైన సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐలు) పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.పాలకుర్తి మండల నూతన ఎస్ఐగా ఊర సృజన్ కుమార్, దేవరుప్పుల మండల నూతన ఎస్ఐగా చింత రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో వారు మర్యాదపూర్వకంగా మాట్లాడారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీలో నిరసన

శేరిపల్లి నుంచి ఢిల్లీ వరకు..
ఓటు హక్కు కోసం పోరాటం: మహేష్ రెడ్డి

ప్రజా వాయిస్ టేక్మాల్ :

ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెదక్ జిల్లా టేక్మాల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మహేష్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని రాజీవ్ చౌక్ వద్ద ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు శాంతియుతంగా ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లతో పాటు పలువురు నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ఈ ఘటనను ఖండిస్తూ పార్లమెంట్ స్ట్రీట్‌లోని సీపీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపినట్లు మహేష్ రెడ్డి వెల్లడించారు. ఓటు చోరీకి పాల్పడుతున్నారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌పై ఆయన విమర్శలు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

లాఠీచార్జిలు, అరెస్టులకు భయపడేది లేదు

ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమాన్ని పోలీసుల లాఠీచార్జిలు, అరెస్టులతో అడ్డుకోలేరని మహేష్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఓటరు హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

జూలూరుపాడును కరువు మండలంగా ప్రకటించాలి

గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్

జూలూరుపాడు, ప్రజా వాయిస్:

ఏలీనినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిపురపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసిన పంటలకి రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన దిగుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో భద్రాద్రి జిల్లా ఒకటని గుర్తు చేశారు. కావున తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఎకరానికి 30 వేలు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కె నాగుల్ మీరా, ఎల్లంకి మధు, పోనేకంటి వెంకటేశ్వర్లు, గుండెపిన్ని మధుసూధనరావు, కంచర్ల రాఘవేంద్రరావు, వలమల్ల సామేలు, హలవత్ బద్రు, కొండ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లి మల్లయ్య కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన కంబాలపల్లి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సరస్వతి విద్యాలయం కరెస్పాండెంట్ తొర్ర విష్ణు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మల్లయ్య కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ. 5,000 ఆర్థిక సహాయాన్నిఅందజేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతివిద్యాలయం ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య గౌడ్, వార్డు సభ్యులు రాగటి మత్స్యగిరి, నాయకులు కోరే మల్లేష్, ఉగ్గె నరేష్, దిగోజు రమేష్ చారి, తొండల అనిల్, గట్టు రాజు, కోరే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలపై మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

నేడు మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు
మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

జిన్నారం ప్రజావాయిస్

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నేడు (శనివారం) బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కార్యాలయ ప్రాంగణంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి ఏర్పాట్లను సమీక్షించి, వేడుకలు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు వార్డు కౌన్సిలర్లు, అధికారులు మున్సిపల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఏఓకు జాతీయ పురస్కారం

జహీరాబాద్ ఏఓ లావణ్యకు జాతీయ అవార్డు..
అంకితభావంతో విధులు నిర్వహించిన లావణ్యకు అరుదైన జాతీయ పురస్కారం..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వ్యవసాయ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్యకు జాతీయ పురస్కారం దక్కింది. జాతీయ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా న్యూ ఢిల్లీలో అవార్డులు ప్రదానం చేసారు. అదేవిధంగా వ్యవసాయ పథకాలు, నూతన సాగు విధానాలు అమలు చేయడంలో తెలంగాణ నుంచి ఏకైక వ్యవసాయ అధికారిణి ఎంపిక కావడం జరిగింది. మహిళా కిసాన్ దివాస్ కార్యాలయంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాతీయ అడిషనల్ అగ్రికల్చర్ సెక్రటరీలు మహేందర్ కుమార్ దివేది, అతిశ్ చంద్రల చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున లావణ్య అవార్డు అందుకున్నారు..

హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహా చండీ హోమం

ప్రజావాయిస్, కీసర :

కీసర రాంపల్లి దాయరా లోని హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా, ఆరవ రోజు మూలా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని మహా చండీ హోమం అత్యంత వైభవోపేతంగా, భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్చారణలు, విశేష పూజా కార్యక్రమాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ మహా చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు. ఈ కార్యక్రమంతో దేవస్థాన ప్రాంగణం భక్తి పారవశ్యంతో అలరారింది. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మహా చండీ హోమం విజయవంతం కావడానికి సహకరించిన భక్తులందరికీ, దాతలకు, సేవకులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన హేమాద్రి ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లో ఫ్లెక్సీలను తొలగించండి

ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాం కలగకుండా చూసుకోవాలి
పంచాయతీ కార్యదర్శికి వినతి అందజేసిన గుండమల్ల సతీష్

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో స్థానిక చౌరస్తా లో ఉన్న బస్టాండ్ కు ఫ్లెక్సీలు కట్టి ప్రయాణిలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుడు గుండమల్ల సతీష్ కుమార్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్ ప్రయాణికులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పిస్తుంది అయితే ప్రస్తుత వివిధ పండుగలు, శుభాకాంక్షలు కార్యక్రమాలకు సంబంధించిన బస్టాండ్ లో ఇష్టాన్ సారంగా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కార్యక్రమాలు ముగిసి వారాలు, నెలల తరబడి గడుస్తున్న నిర్వహకులు వాటిని తొలగించకపోవడం గమనార్షం, ఈ ఫ్లెక్సీలా వల్ల బస్టాండ్ లో కూర్చున్న ప్రయాణికులకు బస్సులు ఎప్పుడు వస్తున్నాయి ఎప్పుడు వెళ్తున్నాయి అనేది స్పష్టంగా కనిపించే లేకపోవడం వల్ల దీంతో ప్రయాణికులు బస్టాండ్లో కూర్చోలేక బయట ఎండలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వృద్ధులు మహిళలు చిన్నపిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంగనాన్ని నిర్మించిన వారి పేరుని కూడా కనబడకుండా కొన్ని ఫ్లెక్సీలు కప్పి వేస్తున్నారని వాపోయారు, తక్షణమే ఈ ప్రాంగణంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు వెంటనే బస్టాండ్ లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించి ఇలాంటివి మళ్ళీ పునరావృతం కాకుండా నిబంధనలు అమలు చేయాలని కోరారు

అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ!
శంకరానంద స్వామి ఆధ్వర్యంలో అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆశ్రమ నిర్వాహకులు శ్రీ శంకరానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా, ఉత్సవాల్లో అమ్మవారు భక్తులకు సరస్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆశ్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞానప్రదాయిని అయిన సరస్వతి దేవి రూపంలో కొలువైన అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందదాయకమని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, విద్యార్థులకు బీజా అక్షరాలు, ప్రత్యేక పూజలు మరియు వేడుకలు నిర్వహించారు.. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కీసరగుట్టలో చండి హోమం

సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శనం

ప్రజావాయిస్, కీసర :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు చండీ హోమం నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో హోమం జరిపించారు. అమ్మవారి అనుగ్రహం, లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు తో వర్ధిల్లాలని, ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటకం వెంకటేష్ శర్మ, ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, ఆలయ వంశపారంపర్యం ధర్మకర్తలు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు...

ఎల్ నినో ప్రభావంతోనే రైతులకు కరెంట్ కష్టాలు..!

- ఎల్ నీనోను తిప్పి కొట్టాలి
- ఎల్ నీనోను ఎదుర్కొనేందుకు సబ్ కమిటీ ఏర్పాటు
- 23 వేల కోట్లతో రైతు రుణమాఫీ
- ఆరు గ్యారెంటీలను అమలు చేసి పేదలకు లబ్ధి
- వచ్చే జూన్ వరకు వర్షం రాదు
- రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



ప్రజా వాయిస్/దుబ్బాక :
దేశంలో ఎల్ నీ నో ప్రభావంతో రైతులకు కరెంట్ కష్టాలు వచ్చాయని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో కాదని, దేశవ్యాప్తంగా కరెంటు సమస్య ఉందని, ఎల్ నినో ను ఎదుర్కోనేందుకు ప్రజలు, రైతులు సహకరించాలని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం దుబ్బాక నియోజకవర్గం దుబ్బాక, భూంపల్లి–అక్బర్పేట్, మిరుదొడ్డి, రాయపోలు, దౌల్తాబాద్, తోగుట మండలాలకు చెందిన 2111 మంది 2బీహెచ్ కే లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు, 179 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 1 కోటి 79 లక్ష 20 వేల రూపాయలకు విలువైన చెక్కులను దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన, గనులశాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...దుబ్బాక నియోజకవర్గం లోని టు బిహెచ్కె ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇస్తున్నామన్నారు.రాష్ట్రంలో పక్కా ఇండ్లు లేకుండా ఎవరు గుడిసెలలో నివసించరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మా ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇండ్లు ఇచ్చామని,మరో 3 వేలు కేవలం సిద్దిపేట జిల్లాలో ఇస్తున్నామన్నారు.త్వరలోనే 2 దశ లబ్ధిదారుల ఎంపిక పూర్తి అవుతుందని తెలిపారు. 414 కోట్లకు జిల్లాలో మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా చేశారని అన్నారు. ముందుగా చెప్పినట్లుగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి పేద ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. గృహజ్యోతి, సన్నబియ్యం, గృహలక్ష్మి పథకాలతో లబ్ధించే కురుస్తుందని, ఎన్నో ఏళ్లకు ఎదురు చూసిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, త్వరలో నూతన ఆసరా పింఛన్ ఇవ్వనున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చేయని విధంగా మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం 23 వేల కోట్ల రూపాయలతో రైతు రుణమాఫీ చేసామన్నారు. ప్రధాన మంత్రి మోదీ పిలుపుతో కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వ సూచనలను పాటించి ఆ విపత్తు నుంచి బయటపడ్డామని, ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో ఎల్ నినో ను ఎదుర్కొనేందుకు రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. మన ఒక్క రాష్ట్రంలోనే కాదు. వివిధ దేశాలతో పాటు దేశ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉందని అయన తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వచ్చే జూన్ వరకు వర్షం రాదన్నారు. సాగునీరు లేదు కాబట్టి ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలన్నారు. వరి వేయవద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఎల్ నీనోను ఎదుర్కొనేందుకు సబ్ కమిటీని వేసిందని అన్నారు. రిజర్వాయర్ లలో ఉన్న నీటిని జాగ్రత్తగా త్రాగునీటి అవుసరాల కోసం వాడుకోవాలని తెలిపారు. గత సంవత్సరం ఈ సమయానికి రాష్ట్రంలో 15వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా ఈసారి వర్షాభావ పరిస్థితులతో ఇప్పుడు 20వేల మెగావాట్ల వినియోగం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల బోర్లు ఉన్నాయి. తొమ్మిదిన్నార గంటలు విద్యుత్ సరఫరా చేస్తామనీ అయన తెలిపారు. అంతకు ముందు దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ...2బీహెచ్ కేలను పూర్తి చేసి గతంలో పంపిణీ చేశారు. పెండింగ్ లో ఉన్నా 2 బిహెచ్ కె ఇండ్లకు పూర్తి స్థాయిలో పట్టాలు ఇస్తున్నామని ఇతర జిల్లాల వాళ్ళ అనర్హులు ఇండ్లలో ఉన్నారు. వారిని తొలగించి స్థానిక లబ్ధిదారులకు అందించాలన్నారు. దుబ్బాక నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్నా ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఎల్ నేనో ప్రభావంతో వర్షాభావంతో నీళు ్ళ లేక రైతులు బాధలో ఉన్నారని పంటలు చివరి స్థాయిలో ఉన్నాయని నీళ్లు వదలాలని,విద్యుత్ కూడా సరిపోయే స్థాయిలో ఇవ్వాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ...కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్, కొత్తరేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్, మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం తదితర అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. వాటిని లబ్ధిదారులు సమర్ధవంతంగా వినియోగించుకోవాలని, ప్రభుత్వం దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభం ప్రారంభించనుంది. త్వరలో విద్యార్థుల ప్రభుత్వ స్కూళ్లలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభంకానున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరాం సంగీత, సిద్దిపేట ఆర్డిఓ సదానందం, 2 బి హెచ్ కే , కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్దిదారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణపై మహిళలకు అవగాహన

- ఆకలి నిర్మూలన, పోషకాహారంపై చైతన్యం
- ఆహార వృథా నివారణపై సూచనలు
- ఇంటి వద్ద సేంద్రియ కూరగాయల సాగుకు ప్రోత్సాహం
- సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యంపై వివరణ
- నేలమ్మ మహిళా రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం తీసుకోవడంతోపాటు, ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో పండించుకోవాలని నేలమ్మ మహిళా రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో పల్లెపహాడ్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళలకు సూచించారు. అక్టోబర్ 15న అంతర్జాతీయ గ్రామీణ మహిళా రైతుల దినోత్సవం, అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని నిర్మూలించడం, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆహారం అందించడం, ప్రతి ఒక్కరికీ సురక్షితమైన పోషకాహారం అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచ ఆహార దినోత్సవం ముఖ్య ఉద్దేశాలని నిర్వాహకులు వివరించారు. ఒకవైపు ప్రజలు ఆహారం కోసం ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు పెద్ద మొత్తంలో ఆహారం వృథా అవుతోందని పేర్కొంటూ, అవసరానికి తగినంత మాత్రమే వండుకోవాలని, మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులను ప్రోత్సహించడం, ప్రకృతికి అనుకూలమైన సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భవిష్యత్తు తరాలకు సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. పంటల సాగులో రసాయనిక ఎరువులను విచక్షణారహితంగా వినియోగించకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడే పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందేలా సమతుల్య ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని వివరించారు. ప్రతి కుటుంబం ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో తమ అవసరాలకు సరిపడా కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకోవాలని మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటి వద్ద పండించిన తాజా కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా వినియోగించడం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొనారు.

చిల్లర రాజకీయాలు మానుకో ప్రతాప్ రెడ్డి

- కార్మికుల వేతన బకాయిలపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలే పెండింగ్
- జూన్, జూలై నెలల వేతనాలు ఇప్పటికే చెల్లింపు
- మార్కెట్ కార్మికులకు శాశ్వత వేతన వనరులు కల్పించాలి
- కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్ విమర్శ

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
సమీకృత కూరగాయల మార్కెట్లో పనిచేస్తున్న రోజువారీ కూలీలకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాప్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్ ఖండించారు. కార్మికులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే వ్యాఖ్యలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, జూన్, జూలై నెలలకు సంబంధించిన బకాయిలను ప్రతాప్ రెడ్డి మార్కెట్ను సందర్శించకముందే వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి చెల్లించారని తెలిపారు. కార్మికుల సమస్యపై రాజకీయ విమర్శలు చేయడం కంటే పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. గజ్వేల్ సమీకృత మార్కెట్ నిర్మాణానికి ఇతర మార్కెట్ల నుంచి రూ. 10.70 కోట్లు అప్పుగా తీసుకున్నారని, అయితే ఇక్కడ పనిచేసే కార్మికులకు శాశ్వత వేతన వనరులు కల్పించకపోవడంతో రోజువారీ కూలీలుగానే కొనసాగుతున్నారని తెలిపారు. సిద్దిపేటలో రైతుబజార్ కార్మికులకు కలెక్టర్ ద్వారా వేతనాలు అందించే ఏర్పాట్లు ఉన్నప్పుడు గజ్వేల్ మార్కెట్లోనూ అలాంటి వ్యవస్థ ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కార్మికులకు వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించాలని నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్ సూచించారు. కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమైతే ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

మండలానికి రూ. 25 లక్షలతో హైమాస్ట్ విద్యుత్ దీపాల నిధులు విడుదల

మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు
మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి
హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలకు హైమాస్ట్ విద్యుత్ దీపాలు మంజూరు కావడం పట్ల ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. డి ఎం ఎఫ్ టి నిధుల కింద ఎల్కతుర్తి మండలంలోని 19 గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు మొత్తం రూ. 25 లక్షలతో పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఆరేపల్లి, చింతలపల్లి, దామెర, దండపల్లి, ఎల్కతుర్తి, గోపాల్పూర్, గుంటూరుపల్లి, ఇందిరానగర్, జగన్నాథ్ పూర్, జిలుగుల, కేశవాపూర్, కోతుల నడుమ, పెంచికల పేట, శాంతినగర్, సూరారం, తిమ్మాపూర్, వల్లభాపూర్, వీర నారాయణపూర్, రామకృష్ణాపురం, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళు కాలనీలు పాఠశాలలు ఆలయాల వద్ద ఈ దీపాలను ఏర్పాట్లు చేయనున్నారు. ఈ హైమాస్ట్ దీపాల ఏర్పాటుతో గ్రామాల్లో రాత్రివేళ వెలుతురు పెరగడం తో పాటు ప్రజల రాకపోకలకు సౌకర్యం భద్రత మెరుగు పడుతున్నాయి. ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు

శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ తరపున మండల ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బిజెపి కార్మిక విభాగం మండల కన్వీనర్ గా పోలే వెంకటేశ్వర్లు నియామకం

ప్రజావాయిస్/మునుగోడు:
బిజెపి కార్మిక విభాగం మునుగోడు మండల కన్వీనర్ గా పోలే వెంకటేశ్వర్లు ను నియామక పత్రన్నీ బిజెపిఎకార్మిక విభాగం జిల్లా కో కన్వీనర్ మాదగోని నరేందర్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై , పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తారని తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన బిజెపి కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ ఐతరాజు సిద్దు, కార్మిక విభాగం జిల్లా కో కన్వీనర్ మాదగోని నరేందర్ గౌడ్, బిజెపి మునుగోడు మండల పార్టీ అధ్యక్షుడు పెంబళ్ళ జానయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..!

- అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసిన కలెక్టర్
- మెడికల్ ఆఫీసర్ గైర్హాజరుపై ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రజా వాయిస్/ దుబ్బాక:
ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.శుక్రవారం అక్బర్ పేట - భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేస్తూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ సెలవుల్లో ఉన్నారని తెలపగా లీవ్ లేటర్ తనిఖీ, లాబ్ టెక్నిషియన్స్ కిరణ్ కుమార్ లీవ్ లేటర్ ఇవ్వకుండా సెలవు తీసుకోవడం, మిగతా సిబ్బంది సైతం ఇష్టానుసారంగా సెలవులు తీసుకోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. లీవ్ లేటర్ ఇవ్వకుండా గైర్హాజరు అయితే తప్పనిసరిగా జీతం లో కోత విధించాలని హెచ్చరించారు. ఓపి రిజిస్టర్ తనికి చేస్తూ మెడికల్ ఆఫీసర్ ఓపి ఈ నెల 8 తేదీ వరకు రాశారని, 9 వ తేదీ నుండి ఈ రోజు వరకు రాయలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విసిట్ చేసి గైర్హాజరు అయిన మరియు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్ఎచ్ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. పిఎచ్ సి కి వచ్చిన రోగులతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేసుకోవాలని, డాక్టర్ ఇచ్చిన మందులతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

పాల్వాయి కనకదుర్గ ఆలయంలో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన- అన్నదాన కార్యక్రమం

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలోని శ్రీ కనకదుర్గ మాత ఆలయంలో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చనతో భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తితో పాటు సేవాభావాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంగరాజు వెంకటేశ్వర్లు, కొండపల్లి గిరి, జోగు వెంకన్న, వెంకటాపురం బుచ్చయ్య, మావిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు